తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# సూళ్లూరుపేటలో 8 కేజీల గంజాయి పట్టివేత

- ఇద్దరు నిందితులు అరెస్ట్



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 15 (ప్రభాతవార్త : సూళ్లూరుపేట పట్టణంలోని పోస్టాఫీసు సమీపం లో శుక్రవారం పోలీసులు జరిపిన దాడుల్లో అక్రమంగా చెన్నైకి తరలిస్తున్న 8 కేజీల గంజా యిని, ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. పోలీసుస్టేషన్‌లో నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి విలేఖరులతో మాట్లాడారు. గంజాయి అక్రమ రవాణా అరికట్టే చర్యలలో భాగంగా జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ రాజేంద్ర పర్యవేక్షణలో సూళ్లూరుపేట సీఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్‌ఐ రవిబాబు తమ సిబ్బందితో దాడులు నిర్వహించి, అక్రమంగా తరలుతున్న 8కేజీల గంజాయిని పట్టుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా తమిళనాడుకు చెందిన పి.నటరాజన్, చింతలపల్లి మండలం అల్లూరు సీతారామరాజు జిల్లాకు చెందిన సిందిరి చల్లారావు అనే స్మగ్లర్లను అరెస్టు చేసి వీరి వద్ద నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ ఒక లక్షా 20వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ కేసును ఛేదించిన సిఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్‌ఐ రవిబాబు, హెడ్‌కానిస్టేబుళ్లు ఎస్.శీనయ్య, సుబ్రహ్మణ్యం, హోంగార్డు వీరయ్య తదితరులను డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి అభినందించారు. వీరిని జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి కూడా అభినందించినట్లు డీఎస్పీ చెప్పారు.

**సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలో 24 గంజాయి కేసులు :** సూళ్లూరుపేట పోలీసు సర్కిల్ పరిధిలో 2019 నుంచి 2023 సెప్టెంబర్ 15 వరకు 24 గంజాయి అక్రమ స్మగ్లింగ్ కేసులను నమోదు చేశామని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మొత్తం 780.94 కేజీల గంజాయి, 8 వాహనాలు, 137 మంది సంబంధీకులు, 126 మందిని అరెస్టు చేయడం, 38 మందిని అనుమానితులుగా తమ వద్ద నమోదై ఉన్నారని ఆయన తెలిపారు. ఇందులో సూళ్లూరుపేట మండలంలో 53 మంది, తడ మండలంలో 10 మంది, శ్రీహరికోటకు సంబంధించి ఒకరు, జిల్లా పరిధిలో 19 మంది, రాష్ట్రం పరిధిలో ఇద్దరు, తమిళనాడుకు సంబంధించి 23 మంది, ఒరిస్సా రాష్ట్రానికి సంబంధించి ఇద్దరు, విశాఖ ఏజన్సీ ప్రాంతానికి సంబంధించి 16 మంది ఈ కేసుల్లో సంబంధీకులుగా ఉన్నారని డీఎస్పీ తెలిపారు.

# దేశం గర్వించదగ్గ ఇంజనీర్ మోక్షగుండం

**-విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలి**

**-ఇంజనీర్లకు ఏపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కె.సంతోషరావు పిలుపు**



నివాళులు అర్పిస్తున్న ఎస్పీడిసిఎల్ ఉద్యోగులు

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: భారతదేశం గర్వించదగ్గ ప్రముఖ ఇంజనీర్ స్వర్గీయ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను నేటి ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఏపిఎస్‌పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు పిలుపు నిచ్చారు. శుక్రవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఎండి సంతోషరావు మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య ఇంజనీర్‌గా అనేక నిర్మాణాత్మక పనులను చేపట్టి ప్రజల మదిలో శాశ్వతంగా నిలిచిపోయారన్నారు. ఆయన పేద కుటుంబంలో పుట్టినప్పటికీ నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తూ సమాజాభివృద్ధిలో మరపురాని పాత్రను పోషించారని అన్నారు. పనినే దైవంగా భావించిన ఆయనను అప్పట్లో భారత ప్రభుత్వం 'భారతరత్న' బిరుదుతో గౌరవించడం గొప్ప విషయమన్నారు. అనంతరం ఏపిసిపిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జె.పద్మజనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ రంగంలోని ఇంజనీర్లు మోక్షగుండం అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధన కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వివిఎన్.బాబు, ఎన్‌వివిఎస్. సుబ్బరాజు, కె.శివప్రసాద్‌రెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్లు డిఎస్.వరకుమార్, డివి.చలపతి, పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, కె.విజయ్‌కుమార్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఎ.రాధా జయశ్రీ, జనరల్ మేనేజర్లు వి.రాధాకృష్ణమ రాజు, బి.చంద్రశేఖర్‌రావు, ఆదిశేషయ్య, జానకిరామ్, శోభా వాలంటీనా, రామచంద్రరావు, మురళి, సురేంద్రరావు, శ్రీకాంత్, రాజశేఖర్‌రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కుప్పంకు త్వరలో...

# హంద్రీ-నీవా నీరు

**- సాగునీటి అవసరాలకంటే తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత**

**- మంచినీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు**

**- డిప్యుటీ సిఎం నారాయణస్వామి, భూగర్భ గనుల శాఖ మంత్రి పెదిద్దిరెడ్డి**



ఇరిగేషన్ అడ్వయిజరీ కమిటీ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మంత్రులు

చిత్తూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: హంద్రీ-నీవా కాలువ పనులు పూర్తి చేసి త్వరలో కుప్పం నియోజకవర్గానికి నీరు అందించడానికి చర్యలు తీసుకొంటా మని డిప్యుటీ సిఎం నారాయణస్వామి, అటవీ, భూగర్భగనులు, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు పేర్కొన్నారు. జడ్పీ సమావేశ భవనంలో శుక్రవారం ఇరిగేషన్ అడ్వయిజరీ కమిటీ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశాలు కలెక్టర్ సగిలి షన్మోహన్ అధ్యక్షతన జరిగాయి. ఈ సమావేశాలకు డిప్యుటీ సిఎం నారాయణస్వామి, భూగర్భ గనులు, అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే చర్యల్లో భాగంగా హంద్రీ-నీవా పనులు పూర్తి చేసి త్వరలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ద్వారా ఈ పథకంను ప్రారంభించడం జరుగుతుందన్నారు. హంద్రీ-నీవా కాలువ వంద చెరువులను నింపుతూ కుప్పం నియోజకవర్గ నీటి సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ద్వారా అందిన సమస్యల పరిష్కారానికి వ్యవసాయ, దాని అనుబంధ శాఖలైన పశుసంవర్ధక, ఉద్యాన, ఇతర శాఖల అధికారులకు జిల్లా అధికార యంత్రాంగం ద్వారా తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశామన్నారు. బైరెడ్డిపల్లి, వి.కోట మండలాలకు తాగునీరు అందించడంలో భాగంగా కైగల్ నదిపై రిజర్వాయర్ నిర్మాణానికి రూ.20.50 కోట్లు, కుప్పం నియోజకవర్గంలో పాలారు నదిపై చెక్‌డ్యామ్ నిర్మించడానికి అవసరమైన ఖర్చుల అంచనాలు సిద్ధం చేసి మంజూరు కోసం ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. అలాగే నలగాంపల్లి వద్ద వున్న గంగమ్మ శిరసు వంకపై రిజర్వాయర్ నిర్మించి పలమనేరు పట్టణానికి తాగునీరు అందిచడానికి చర్యలు తీసుకొంటున్నామన్నారు. చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేల అభ్యర్థనల మేరకు చామంతిపురం వద్ద వైఎస్ఆర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఏర్పాటుకు అవసరమైన అంచనా ఖర్చులను తయారు చేయాలన్నారు. అలాగే కుప్పం బ్రాంచ్ కెనాల్ నుండి గ్రావిటీతో యమనూరు వద్ద గల ఒక టిఎంసి సామర్థ్యం గల రిజర్వాయర్‌కు నీటిని అందించడానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. డిప్యుటీ సిఎం నారాయణస్వామి మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి అవసరాల కంటే తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కలెక్టర్ సగిలి షన్మోహన్ మాట్లాడుతూ ప్రాజెక్టుల్లో వున్న నీటి నిల్వలను పరీక్షించి అందుకు అనుగుణంగా ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్ శాఖల ద్వారా ముందస్తు చర్యల కోసం తగు ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. అలాగే జులై 2023 నెలలో ఆశించిన మేరకు వర్షపాతం నమోదు కాలేదన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్- 2023లో పంట వేసిన ప్రతి రైతు పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ-క్రాప్ చేయించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీ రెడ్డప్ప, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, డిఎఫ్ఓ చైతన్య కుమార్‌రెడ్డి, డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ వైస్ ఛైర్మన్లు భూమిరెడ్డి ధనజంయరెడ్డి, రమ్యలు, ఈడిగ కార్పొరేషన్ ఛైర్మన్ శాంతి, డిసిసిబి ఛైర్‌పర్సన్ రెడ్డమ్మ, ఇరిగేషన్ ఎస్‌ఇ విజయకుమార్‌రెడ్డి, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఇ రాజగోపాల్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ జెడి ప్రభాకర్, డ్వామా పిడి గంగాభవానీ, ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్‌ఇ కృష్ణారెడ్డి, చిత్తూరు ఆర్డీఓ డాక్టర్ రేణుక, నగరి ఆర్డీఓ సుజన, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తెల్లగుండపల్లె వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**-ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న అంబులెన్స్**

**-ఐదు మంది దుర్మరణం**



తెల్లగుండపల్లె వద్ద ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న అంబులెన్స్





తవణంపల్లె, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: రోగిని తరలిస్తున్న అంబులెన్స్ రోడ్డు పక్కన ఆగి వున్న ఆయిల్ ట్యాంకర్‌ను వెనుక వైపు నుండి అతివేగంగా వెళ్ళి ఢీకొన్న సంఘటనలో రోగితో సహా నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా అంబులెన్స్ డ్రైవర్ తీవ్రగాయాలకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈదుర్ఘటన మండలంలోని బెంగుళూరు-తిరుపతి సిక్స్‌లేన్ రోడ్డులోని తెల్లగుండ్లపల్లె వద్ద శుక్రవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. సంఘటనకు సంభందించి చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, తవణంపల్లె ఎస్సై సుధాకర్‌రెడ్డిల కథనం మేరకు వివరాలిలావు న్నాయి. ఒడిస్సా రాష్ట్రం అంగారక సహీరా కెంద్రపారకకు చెందిన ఉమేష్ చంద్ర సాహు (46)ను అనారోగ్య సమస్యల కారణంగా చికిత్సం నిమిత్తం బెంగుళూరులోని విక్టోరియా ఆస్పత్రికి తీసుకెళ్ళారు. చికిత్సల అనంతరం భార్య, సమీప బంధువులతో కలసి అంబులెన్స్‌లో స్వగ్రామానికి తిరుగు ప్రయాణ మయ్యారు. వీరు ప్రయాణిస్తున్న అంబులెన్స్ మండలంలోని బెంగుళూరు- తిరుపతి సిక్స్‌లేన్ రోడ్డులో బెంగుళూరు నుండి ఒంగోలు వెళుతూ రోడ్డు పక్కన ఆగివున్న ఆయిల్ ట్యాంకర్‌ను తెల్లగుండ్లపల్లె వద్ద శుక్రవారం తెల్లవారు జామున సుమారు 4.30 గంటలకు వెనుక వైపు నుండి వేగంగా వెళ్ళి ఢీకొంది. ఈఘటనలో అంబులెన్స్‌లో వున్న రోగి ఉమేష్ చంద్ర సాహు (46), అతని భార్య రష్మితా సాహు(45), వారి సమీప బంధువులు గోబిందపూర్‌కు చెందిన త్రిలోచన్ నాయక్(63), బిజయ్ నాయక్(56)లు తీవ్రగాయాలకు గురై అక్కడిక్కడే మృతి చెందారు. అలాగే అంబులెన్స్ డ్రైవర్ సంజయ్ కుమార్ జేన(30), అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న జసిన్ కుమార్ సాహు, బేబ బ్రతదాస్‌లు తీవ్ర గాయాలకు గురయ్యారు. వీరిని వెంటనే చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలించగా అంబులెన్స్ డ్రైవర్ సంజయ్ కుమార్ సేన ఆస్పత్రిలో చికిత్స పొదుతూ మృతి చెందాడు. సంఘటన సమాచారం తెలుసుకున్న చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, తవణంపల్లె, కాణిపాకం, యాదమరి ఎస్సైలు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, సుమన్‌లు సిబ్బందితో కలసి హుటాహుటిని సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా వుండ డంతో జెసీబీ సహాయంతో అతి కష్టం మీద అంబు లెన్స్‌ను పక్కకు తీసి అందులోని మృతదేహాలను బయ టకు తీసి పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన క్షతగాత్రులను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంబులెన్స్ డ్రైవర్ డ్రైవింగ్‌లో నిద్రమత్తులోకి జారుకోవడం వల్లనే ఘోర ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రమాదం కారణంగా రోడ్డుపై రాకపోకలు కొంత సేపు స్థంభించి పోవడంతో స్థానిక పోలీసులు ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. ఈప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవిశంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డిలు తెలిపారు.





## వేడుకొందామా....వేంకటనాధుడిని!

# " భగవంతుడు" బ్రహ్మోత్సవాలు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:**

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు తిరుమల గిరులు ముస్తాబయ్యాయి. సాంవత్సరిక ఉత్సవాల్లో ప్రత్యేకంగా తొమ్మిది రోజులు పాటు ఉదయం, రాత్రి వాహనసేవలతో అంగరంగవైభవంగా జరిగే "బ్రహ్మోత్సవాలు" జరుపుకోవడానికి దేవదేవుడు శుభముహూర్తం ఖరారుచేశాడు. శ్రీవేంకటేశ్వరుని ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఒక్కో వాహనంపై ఒక్కో విశిష్టతతో ఊరేగి భక్తులను కటాక్షించడం ప్రత్యేకత. తొమ్మిదిరోజులు జరిగే బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఏడుకొండలు నిజంగా కలియుగ వైకుంఠంగానే దర్శనమిస్తాయి. సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు 17వతేదీ ఆదివారం సాయంత్రం ఆగమోక్తంగా అంకురార్పణ చేపడతారు. 18న సాయంత్రం సోమవారం ధ్వజా రోహణంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతారు. ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8గంటలకు ప్రారంభమవుతుంది. రాత్రి వాహనసేవ 7గంటలకు జరిపిస్తారు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజులు ఆలయంలో శ్రీవారికి జరిగే అన్ని రకాల సేవలు, ప్రత్యేక ప్రవేశ దర్శనాలు రద్దుచేశారు. మాఢవీధుల్లో గ్యాలరీలు, రంగుల రంగవల్లులు, విద్యుద్దీపాలంకరణలు, తోరణాలు, పుష్పాలంకరణలు పూర్తిగా సిద్ధం చేశారు. దేవతామూర్తుల ప్రతిమలతో నిజంగానే కలియుగవైకుంఠంగా దేదీప్యమానంగా వెలుగొందుతోంది.







# అభివృద్ధి పనులపై సత్వర చర్యలు చేపట్టాలి

**-ధర్మరాజుల స్వామి ఆలయం వద్ద రెండు కళ్యాణమండపాలు**

**-భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి**

**-సమావేశంలో ధర్మకర్తల మండలి తీర్మానం**



సమావేశంలోమాట్లాడుతున్న ఎంఎల్ఏ, చైర్మన్

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ధర్మరాజుల స్వామి ఆలయం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో రెండు కళ్యాణమండపాలను నిర్మించాలని శుక్రవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో నిర్ణయించారు. చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశానికి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ముఖ్యఅతిదిగా వచ్చారు. ఆలయ ఇఓ కె వి సాగర్‌బాబు వివిధ అంశాలపై స్పందించారు. సూపరింటెండెంట్ శ్రీహరి అజెండాను చదివారు. అభివృద్ధి పనులకు సంబందించిన అంశాలపై ఇఇ నూకారత్నం సమాధానం చెప్పారు. ఆలయ పరధిలోని పలు చోట్ల అభివృద్ధి పనుల వేగం పెంచాలని, భక్తుల అవసరాలకు పెద్ద పీటవేయాలని ఎమ్మెల్యే, చైర్మన్లు ఆలయ సిబ్బంది సూచించారు. బంగారమ్మ ఆలయం వద్ద ఫ్యాబ్రిక్ పద్దతిలో కళ్యాణ మండపం నిర్మించుటకు ప్రతిపాదించగా ఇంజనీరింగ్ విభాగం అంచనాలు తయారు చేయాలని సమావేశం తీర్మానించింది. వేయి లింగాల కోనకు తమిళనాడు, కర్నాటకల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. కాబట్టి అక్కడ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆలయ గోపుర నిర్మాణం పునర్నిర్మాణం చేయటానికి సమావేశంలో చర్చించారు. శుకబ్రహ్మాశ్రమం సమీపంలో శిధిలావస్థకు చేరుకున్న కోనేరును మరమ్మతులు చేసి చుట్టుపక్కల భూగర్భ జలాలను అభివృద్ధి చేయటానికి చర్యలు తీసుకోవాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం బ్రహ్మగుడి నుంచి భరద్వాజసదన్ వరకు రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరించేటకు సమావేశంలో చర్చించారు. రామసేతు వంతెన నుంచి జలవినాయక ఆలయం వరకు విశాలంగా ఉన్న స్థలంలో తూర్పు అభిముఖంతో సూర్యనారాయణస్వామి విగ్రహాన్ని, అలాగే పడమర అభిముఖంగా కాలభైరవస్వామి విగ్రహాన్ని, దక్షిణాముఖంగా గురుదక్షిణామూర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేయుటకు తీర్మానించారు. అలాగే సన్నిధిలోని దేవస్థానం పర్యవేక్షణలోని కర్మక్రియల మండపం ఆధునీకరణ చేయాలని తీర్మానించారు. భక్తకన్నప్ప కొండపై నిర్మించిన శివపార్వతుల చుట్టు పూల మొక్కలు పెంచుటకు సమావేశం తీర్మానించింది. ప్రసన్న వరదరాజస్వామి ఆలయం ఆవరణలో వరలక్ష్మీ వ్రతం జరుపుకొనుటకు గోదాదేవి కళ్యాణం, సీతారాముల కళ్యాణాలు జరుపుటకు నైరుతి భాగంలో మండపాన్ని నిర్మించుటకు దేవస్థానం అనుబంధ ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణుని మండపాన్ని నిర్మించి నూతన మండపం నిర్మించుటకు ప్రహరి గోడను నిర్మించుటకు తీర్మానించారు. ఈ సమావేశంలో సభ్యులు మున్నారాయల్, బుల్లెట్ శ్యాం, ఎపెద్దిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి మహీధర్‌రెడ్డి, పసల సుమతి, కొండూరు సునీత, రమాప్రభ, లక్ష్మీ ఎస్‌ఎంకె కాళహస్తీశ్వర గురుకుల్, చింతామణి పాండు దేవస్థానం ప్రధానార్చకులు సంబంధం గురుకకుల్, కరుణాకర్ గురుకుల్, ఇఇ నూకారత్నం, ఆలయాధికారులు వెంకటసుబయ్యయ్య, కృష్ణారెడ్డి, ధనపాల్, సతీష్‌మాలిక్, ప్రసాద్, లోకేష్‌రెడ్డి, శ్రీహరి, మల్లికార్జున్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య రంగంలో మార్పులు సృష్టించిన ఘనత ప్రభుత్వానిదే

- జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి



వర్చువల్ విధానంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

తిరుపతి టౌన్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : వైద్య రంగంలో అనేక మార్పులు చేపట్టి చరిత్ర సృష్టించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిది అని జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి అన్నారు. శుక్రవారం విజయ నగరం జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభించి అక్కడ నుండి రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో మరో నాలుగు కొత్త వైద్య కళాశాలలను వర్చువల్ విధానంలో ప్రారంభించి ప్రసంగించారు. శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాల ఆడిటోరియం నుండి జిల్లా కలెక్టర్, టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ శిరీష, ఎస్వీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ తదితర అధికారులతో, వైద్య విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 11 మెడికల్ కాలేజీలు మాత్రమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నాయని, ఈ ప్రభుత్వం వచ్చాక మరో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టడం జరిగిందని, అందులో నేడు 5 మెడికల్ కళాశాలలను ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, వచ్చే సంవత్సరం ఐదు వైద్య కళాశాలలను అడ్మిషన్ స్థాయికి తెస్తామని, ఆ మరుసటి సంవత్సరం మిగిలిన ఏడు వైద్య కళాశాలలలో వైద్య సదుపాయాలు పెంచి, ఆధునిక టెక్నాలజీ అమలుతో నాడు నేడు కింద రూపు రేఖలు మార్చి ఆధునీకరణ చేయడం జరిగిందన్నారు. వైద్య ఆరోగ్య శాఖలోని దాదాపు అన్ని పోస్టులను భర్తీ చేయడం జరిగిందన్నారు. మంచి డాక్టర్లుగా కావాలని ఆకాంక్షించారు. గిరిజన ప్రాంతాల్లో కూడా మెరుగైన వైద్యం అందాలనే ఉద్దేశ్యంతో అనేక చర్యలు చేపట్టామని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేది నుండి ప్రారంభిస్తున్నామని అన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నేడు ఈ ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రారంభం ఒక చరిత్ర అని, గ్రామీణ విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా ఉంటుందని, చాలా కష్టపడి చదివినా విద్యార్థులకు నాలుగు సంవత్సరాల ఎంబీబీఎస్‌లో సీట్ పొందడం ఒక యుద్ధమే, అలాగే పీజీ సీటు రావడం కూడా ఒక గట్టి పోరాటమే అని గత ఐదు సంవత్సరాల ముందు మీరు ప్రభుత్వం ఉండి ఉంటే బాగుండేదని అన్నారు. ఆరోగ్య శ్రీ మొదలుకొని నేడు ప్రారంభించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వరకు అనేక కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహిస్తూ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఆరోగ్య శ్రీ తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా సకాలంలో గర్భిణీ స్త్రీలను ఆసుపత్రుల్లో చేర్చి ఇన్స్టిట్యూషనల్ ప్రసవం జరిగేలా తల్లి బిడ్డ ఆరోగ్యాన్ని పరిరక్షించి మాతా శిశు మరణాలు అరికట్టడం ఎంతో హర్షించదగ్గ పరిణామం అని తెలిపారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపెయిన్ నేటి నుండి ప్రారంభ నేపథ్యంలో బ్యానర్‌ను కలెక్టర్ టిటిడి చైర్మన్, ఎమ్మెల్సీ మేయర్‌లతో కలిసి ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా డిఎంహెచ్ఓ శ్రీహరి, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి, ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ పార్థ సారథి తదితరులు అధికారులు పాల్గొన్నారు.

## చంద్రబాబు ఆరోగ్యం..బెయిల్‌కై మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :



తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ సిఎం చంద్రబాబునాయుడుకు త్వరగా బెయిల్ రావాలని, అలాగే ఆయన ఆరోగ్యవంతంగా ఉండాలని కోరుతూ శుక్రవారం కుప్పం నియోజకవర్గంలోని వివిధ మసీదుల్లో తెదేపా నేతలు, మైనార్టీ విభాగం నేతలు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. స్థానిక మర్కజ్ మసీదులో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎంపిపి డా॥వెంకటేష్, మాజీ కోఆప్షన్ సర్దార్ బాషా, కొత్తపేట మసీదులో రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మాజీ షాదీఖానా ఛైర్మన్ అన్సర్ బాషా, సయ్యద్ యూసుఫ్ తదితరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మోడల్ కాలనీ మసీదు వద్ద రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి గని ఉల్లా, పార్టీ అధ్యక్షుడు అల్లాబకష్ అధ్వర్యంలో ప్రత్యేక దువా చేశారు. అలాగే కుప్పం మండలం మిట్టపల్లిలో, రామకుప్పంలోని రెండు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టగా పార్టీ మైనార్టీ విభాగం నేతలు పాల్గొన్నారు.

**శాంతిపురం :** తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఆరోగ్యం కోసం మండలంలోని రాళ్లబూదుగూరు మసీదులో శు క్రవారం తెదేపా మైనార్టీ నేతల అధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అలాగే చంద్రబాబుకు త్వరగా బెయిల్ మంజూరు కావాలని ప్రార్థనలు జరిపారు.

## మోక్షగుండం విశ్వేశ్వరయ్య భావితరాలకు ఆదర్శం

-బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్



**కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వ రయ్య భావితరాలకు ఆదర్శమని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భావితరాలకు ఆదర్శమని బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఇంజనీర్ల దినోత్సవంను ఘనంగా నిర్వహిం చారు. విద్యార్థులు మోక్షగుండంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మనిషి మేథస్సుకు శాస్త్రీయత తోడైతే మహాద్భుతాలు సృష్టించవచ్చని మోక్షగుండం నిరూపించారన్నారు.కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రీజనల్ ఛైర్మన్ భక్తవత్సలరెడ్డి, ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డా॥ కోదండరామయ్య, ఇంజనీరు దివాకర్, లయన్స్‌క్లబ్ జోనల్ ఛైర్మన్ డా॥ మహేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రబాబుఅరెస్ట్‌కు న్యాయవాదుల నిరసన

కుప్పంరూరల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :



ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడం పట్ల కుప్పంలోని తెదేపా లీగల్‌సెల్ న్యాయవాదులు స్థానిక కోర్టు ఆవరణ ఎదుట నిరసన తెలిపారు. కేవలం చంద్రబాబుపై కుట్రతోనే వైకాపా ప్రభుత్వం ఆయన్ను అరెస్ట్ చేయించిం దన్నారు. కార్యక్రమంలో స్టేట్ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు బిఆర్ అమరనాథ్, నియోజకవర్గ అధ్యక్షుడు విఎస్ శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వాసు, సీనియర్ న్యాయవాది మధుసూధన్, న్యాయవాదులు వివేక్, పళని, జలపతి, సత్యవేలు పాల్గొన్నారు.

## మున్సిపల్ జెసిఎస్ కన్వీనర్‌గా ఎంఎంసి ఛైర్మన్

కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :



కుప్పం మున్సిపాలిటీ జెసిఎస్ కన్వీ నర్‌గా ఎంఎంసి ఛైర్మన్ ఎఎస్ విద్యాసాగర్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఎంఎంసి ఛైర్మన్‌ను మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ ఘనంగా సత్కరించారు. మున్సిపాలిటీలోని 12 సచివాలయాలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు ఇన్‌చార్జ్‌గా కన్వీనర్ విద్యాసాగర్ వ్యవహరిస్తార న్నారు. కన్వీనర్ విద్యాసాగర్ మాట్లాడుతూ కుప్పం మున్సిపాలిటీలో పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేస్తానన్నారు. ఈసందర్భంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో సలహాదారు ఆర్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఏరియా ఆస్పత్రికి కొత్త వీల్ చెయిర్లు

కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :



కుప్పం ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగుల కొరకు ప్రభుత్వం నుంచి కొత్తగా ఐదు వీల్ చెయిర్లు వచ్చాయి. వీటిని శుక్ర వారం మున్సిపల్ ఛైర్మన్ డా॥సుధీర్ ఏరియా ఆస్పత్రి ఎంఎస్‌కు అప్పగించారు. కార్యక్రమంలో ఎంఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, కౌన్సిలర్లు రంగయ్య, జగన్, అరవింద్, నాగరాజు, ఆంజనేయగుడి ఛైర్మన్ కుమరేష్, వైద్యులు పాల్గొన్నారు.

## మండల అధ్యక్షుడిగా సురేష్‌బాబురెడ్డి నియామకం



**తవణంపల్లె, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** మండల వైకాపా అధ్యక్షుడిగా ఎల్.సురేష్ బాబురెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మండల కన్వీనర్‌గా సిద్దంపల్లె హరిరెడ్డి కొనసాగుతుండగా ఆయన స్థానంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వున్న లక్ష్మాంబపురంకు చెందిన ఎల్.సురేష్‌బాబురెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మండల పార్టీ అధ్యక్షుల నియామకంలో భాగంగా జిల్ల మంత్రి పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడిగా వున్న సురేష్‌బాబురెడ్డిని పార్టీ అధిష్టానం మండల అధ్యక్షుడిగా నియమించింది.

## మండల వైకాపీ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి నియామకం

ఐరాల, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:



మండల వైకాపా నూతన అధ్యక్షుడిగా పుత్రమద్దికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి అలియాస్ బుజ్జిరెడ్డిని నియమిస్తూ పారీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ వీర విధేయు డిగా మండలంలో పార్టీ అభివృద్ధికి చేసిన సేవలకు గుర్తింపుగా ముచ్చటగా మూడోసారి చంద్రశేఖర్‌రెడ్డిని మండల పార్టీ అధ్యక్షుడిగా పార్టీ అధిష్టానం నియమించింది. నూతన అధ్యక్షుడిగా మూడవసారి ఎన్నికైన చంద్రశేఖర్‌రెడ్డిని ఆపార్టీ మండల నాయకులు అభినందించారు.

## 16న కాణిపాకంలో ధర్మప్రచార వైభవోత్సవ సభ

కాణిపాకం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:

రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ, కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16న ధర్మప్రచార వైభవోత్సవ సభ నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు తెలిపారు. ధర్మప్రచార మాసోత్సవాలల్లో భాగంగా ఈనెల 16నుండి అక్టోబర్15 వరకు కాణిపాకం దేవస్థానం ప్రచార రథం ద్వారా జిల్లాలోని మారుమూల గ్రామాలు, వెనుకబడిన ప్రాంతాల్లో ధర్మ ప్రచారాన్ని విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈప్రచార రథాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా, చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. వైభవోత్సవ సభను చిత్తూరు పార్లమెంట్ సభ్యులు రెడ్డెప్ప, స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబుల చేతుల మీదుగా ప్రచారరథంను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమం ఏర్పాట్లుపై ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు తెలిపారు.శనివారం తవణంపల్లె శ్రీకోదండరామస్వామి దేవస్థానం వద్ద సాయంత్రం 5 గంటలకు ధర్మ ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

## మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబుకు బాసటగా నిలుద్దాం

గంగాధర నెల్లూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:



మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రజలందరూ బాసటగా నిలుద్దా మని గంగాధర నెల్లూరు నియోజక వర్గ టిడిపి ఇన్చార్జి డాక్టర్ థామస్ అన్నారు. నియోజక వర్గ కేంద్రమైన గంగాధర నెల్లూరులో మూడో రోజు రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి తెలుగు దేశం పార్టీకి రాష్ట్రంలో వస్తున్న ఆవరణను చూసి ఓర్చుకో లేక దొడ్డి దారిన కేసులతో చంద్రబాబు నాయుడిని జైలు పాలు చేశాడని దీన్ని రాష్ట్ర ప్రజ లందరూ గమనిస్తున్నారని త్వరలోనేవైకాపాను ప్రజలు ఇంటికి సాగనంపుతారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు స్వామిదాస్,పెనుమూరు మండల పార్టీ అధ్యక్షులు రుద్రయ్య నాయుడు, కార్వేటినగరం మండల అధ్యక్షులు చెంగల్రాయ్ యాదవ్, వెదురుకుప్ప మండల పార్టీ అధ్యక్షులు లోకనాధ్ రెడ్డి,శ్రీరంగ పురం మండల పార్టీ అధ్యక్షులు జయశంకర్ నాయుడు రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి పిఎస్ మనోహర్ నాయుడు రాష్ట్ర ప్రభావశీలుల కమీటి మెంబర్ భీమనేని చిట్టిబాబునాయుడు,జిల్లాకార్యనిర్వహణకార్యదర్శికృష్ణనాయుడుశ్రీధర్‌యాదవ్,నేతలుతలారి రెడ్డెప్ప, మోహన్,మురళి,అరుణలతో పాటు నియోజక వర్గ పరిధిలోని టిడిపి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూర్మానిపల్లి పాఠశాలలో డివైఇఒ విచారణ

కుప్పంరూరల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :



మండలంలోని కూర్మానిపల్లి పాఠశాలలో శుక్రవారం డివైఇఒ చంద్రశేఖర్ విచారణ చేపట్టారు. ఈపాఠశాలలో పనిచేస్తున్న రేఖ అనే ఉపాధ్యాయురాలు పిల్లలను కొట్టడంతో ఇటీవల గ్రామస్తులు మూకుమ్మడిగా పాఠశాలకు తాళాలు వేసిన విషయం విదితమే. ఈ సంఘటనపై డివైఇఒ విచారించారు. కాగా శుక్రవారం సైతం తల్లిదండ్రులు ఉపాధ్యాయురాలి తీరుపై డివైఇఒకు ఫిర్యాదు చేశారు. పిల్లలకు పాఠాలు సక్రమంగా చెప్పడం లేదని వాలంటీర్‌ను ఎలా నియమిస్తారని ప్రశ్నించారని ఫిర్యాదు చేశారు. అనంతరం డివైఇఒ మాట్లాడుతూ ఎంఇఒ, సిఆర్‌పి, తల్లిదండ్రులు ఇచ్చిన నివేదికలు పరిశీలించి జిల్లా ఉన్నతాధికారులకు పూర్తి వివరాలు అందజేస్తామని తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఆగివున్న టూవీలర్‌ను ఢీకొన్న కారు..వ్యక్తికి తీవ్రగాయాలు.

పెద్దపంజాణి సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :



పెద్దపంజాణి మండలంలోని ఒంటిల్లు సమీపంలో రోడ్డుపక్కన ఆగివున్న (టి.వి.ఎస్ సూపర్ ఎక్స్ఎల్) ద్విచక్ర వాహనాన్ని వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఆవ్యక్తికి తీవ్ర గాయాల య్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలిలా..గంగవరం మండలం కలగటూరుకు చెందిన క్రిష్ణప్ప(70) చెన్నై-ముంబై జాతీయ రహదారిలో ఒంటిల్లు సమీపంలో రోడ్డు దాటేందుకుగాను ద్విచక్రవాహనాన్ని ఆపి ఎదురు చూస్తున్నాడు.ఇదే సమయంలో పుంగనూరు వైపునుంచి పలమనేరు వైపు వెళ్తున్న శాంత్రో కారు వేగంగా వచ్చి క్రిష్ణప్ప ద్విచక్రవాహనాన్ని ఢీకొంది దీంతో క్రిష్ణప్పకు కాలు,తల భాగాలకు తీవ్రగాయాలయ్యాయి.స్థానికులు హుటా హుటిన క్రిష్ణప్పను పలమనేరు ఏరియా ఆసుపత్రికి 108లో తరలించారు. క్రిష్ణప్ప కుటీంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

## వైఎస్ఆర్ పింఛన్ కానుక సద్వినియోగం చేసుకోండి : జడ్పీటిసి

వెదురుకుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:



వైఎస్ఆర్ పింఛన్ కానుకను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటిసి సభ్యులు చలం పాళ్యం సుకుమార్ పేర్కొన్నారు. మండలంలోని మాంబేడు సచివాలయంలో శుక్రవారం కొత్తగా మంజూరైన పెన్షన్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందజేయడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కార్యచరణ ప్రణాళికతో ముందుకు వెళ్ళడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా అధికారుల, కార్యాలయాల చుట్టు తిరిగే పనిలేకుండా వాలంటీర్ల వ్యవస్థ తీసుకువచ్చి వారి ద్వారా నేరుగా ఇంటిదగ్గర అంజేస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సచివాలయం పరిధిలో మంజూరైన 40 మంది అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ కార్యదర్శి బండి గోవర్ధన్ రెడ్డి, సర్పంచ్ కవిత, డీడీవో సుబ్రమణ్యం,సచివాలయ సిబ్బంది, నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలకు విద్యార్థులు బీరువా, కుర్చీలు వితరణ

వెదురుకుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :



వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీ.కాం మూడవ ఏడాది చదువుతున్న విద్యార్థులు కళాశాలకు బీరువా, కుర్చీలు అందజేశారని కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ శారద పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులు సమావేశం ఏర్పాటు చేసి అధ్యాపకులకు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన కళాశాలలో కామర్స్ డిపార్ట్మెంట్ అభివృద్ధికి విద్యార్థులు స్వచ్ఛందం ముందుకు రావడం అభినందనీయన్నారు. కామర్స్ డిపార్ట్మెంట్ రికార్డులు భద్రపరచడంకు కొరకు విద్యార్థులు బీరువా ఇవ్వడంతో పాటు అధ్యాపకుల సౌకర్య కోసం ఆరు కుర్చీలు ఇచ్చారని చెప్పారు. వాటి విలువ 9360 రూపాయలని వివరించారు. విద్యార్థులు అందరు స్వచ్ఛందంగా నూతన కళాశాల అభివృద్ధిలో భాగస్వామ్యులు కావలని చూచించారు. బీ.కాం విద్యార్థు లను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యర్థులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కడిగిన ముత్యంలా బయటకు వస్తారు : మాజీ జిల్లా కార్యదర్శి

వెదురుకుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :



వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల నుంచి చంద్రబాబు కడిగిన ముత్యంలా వస్తాడని టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి మోహన్ మురళి ధీమా వ్యక్తం చేశారు. పార్టీ పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తున్న రిలేనిరాహాదీక్ష కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి చర్యలను నిలదీశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లోకనాధ రెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్ నాయుడు, నాయకులు బియం. రవి, రమణా రెడ్డి, దామోదర్ రెడ్డి, గుణశేఖర్ రెడ్డి, నాగరాజ రెడ్డి, షణ్ముగం, పద్మనాభ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కాలం చెందిన రొయ్యల మందులు విక్రయిస్తే చర్యలు తప్పవు

చిల్లకూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :



స్థానిక చిల్లకూరు గ్రామంలోని జాతీయ రహదారి పక్కనే ఏర్పాటై వున్న దేవిశ్రీ ఫుడ్ షాపును గురువారం జిల్లా జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస నాయక్ ఆదేశాల మేరకు మత్స్యశాఖ అధికారులు తనిఖీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారులు మేరకు తనికీలు నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా దేవీ శ్రీపుడ్ షాపుకు లైసెన్స్ లేదని గత కొంత కాలం నుండి లైసెన్స్ పొందాలని పలుమార్లు నోటీసులు ఇచ్చినా ఫలితం లేదన్నారు. అదే విధంగా సిప సర్టిఫికేటు కూడా లేదని కాలం చెల్లిన రొయ్యల మందులు స్టాల్‌లో పెట్టి విక్రయిస్తున్నారన్నారు. పదే పదే చెబుతున్నా పట్టించుకోవడం లేదని అందుకోసమే ఈ తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. డెబ్బై వేల రూపాయిలు పెనాలిటీ విధించడం జరిగిందన్నారు. ఈ మొత్తాన్ని మూడు రోజుల్లో మత్స్యశాఖ కార్యాలయంకు జమ చేయాలన్నారు. అలా లేనిచో షాపును సీజ్ చేయడం జరుగుతుందని ఎఫ్‌డి రఘుబాబు తెలిపారు. అదే విధంగా చిల్లకూరులో మరి కొన్ని షాపులో కూడా అనుమతి లేని కాలం చెల్లిన రొయ్యల మందులు విక్రయిస్తున్నారని వారిపైన కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మందుల వాడిన వల్ల రైతులు తీవ్ర నష్టానికి గురి అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ బృందం వరప్రసాద్, పుష్పరాజు, విజయ, లిఖిత, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ప్రధాతకు సంకేళ్లు వేస్తారా ?

కోట,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :

రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన వారికి సంకేళ్లు రాక్షస రాజ్యంలో రైతులకు బేడీలు వేస్తున్నారని తిరుపతి జిల్లా బిసి సెల్ నాయకులు తీగల సురేష్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. కోటలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి నైపుణ్య శిక్షణ ఇప్పించాలని చంద్రబాబు నాయుడు ఆక్షాంక్షించారన్నారు. దానికి అనుగుణంగానే ప్రపంచంలో పెద్ద కంపెనీల్లో ఒకటైన సీమెన్స్ కంపెనీ ద్వారా రాష్ట్ర యువతకు శిక్షణ ఇప్పించారని పేర్కొన్నారు. 3.80 లక్షల మంది శిక్షణ తీసుకుంటే సుమారు 85 వేల మంది మందికి పైగా విద్యార్థులు రూ లక్షల జీతాలతో కొలువులు సాధించారన్నారు.శిక్షణ ఇప్పించిన పెద్ద కంపెనీలను బజారుకు లాగితే భవిష్యత్తు ఇక ఏ కంపెనీ రాష్ట్రం వైపు చూసే అవకాశం ఉండదన్నారు. చంంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు నిరిశిస్తూ ప్రపంచ వ్యాప్తంగా నిరశసనలు వ్యక్తమవుతున్నాయన్నారు.

## వ్యక్తి అనుమానస్పద మృతి!

చిల్లకూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :



చిట్టమూరు మండలం మొలకలపూడి గ్రామానికి చెందిన వంకా నరేష్ (40) అనుమానస్పదంగా మృతి చెందాడు. అయితే స్థానికుల వివరాల మేరకు వంకా నరేష్ బ్రతుకు దెరువు కోసం చిల్లకూరులోని జాతీయ రహదారి పక్కన చిల్లర అంగడి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం బైకుపై వెళ్లి రెట్టపల్లి గ్రామ సమీపంలోని రోడ్డుపై పడి వున్న విషయాన్ని స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతి చెందిన విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్ఐ బి.గోపాల్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గూడూరు ప్రాంతీయ వైద్య శాలకు తరలించారు. నరేష్ మృతి పై పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

## టిడిపితో జనసేన పొత్తుపై చారిత్రాత్మక ప్రకటన

కోట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :

రాబోయే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీతో జనసేన పార్టీ పొత్తుతో పోటీ చేస్తుందని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించడం చారిత్రాత్మకమని తెలుగుదేశం తిరుపతి జిల్లా కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం కోటలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 2014 అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ స్వయంగా పోటీ చేయకుండా తెలుగుదేశంపార్టీకి మద్దతు ప్రకటించిన విషయం, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో 2019లో జనసేన విడిగా పోటీ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, అమరావతి రాజధాని నిర్మాణం, సంపూర్ణ మద్య నిషేధం, సిపిఎస్ రద్దు, అగ్రిగోల్డ్ బాధితులకు నెలలోగా పూర్తిస్థాయిలో చెల్లింపులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళలకు 40 సంవత్సరాలకు పింఛన్, నిరుద్యోగులకు ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ వంటి వాగ్ధానాలతో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిప వాగ్ధానాన్ని అమలుపరచలేదని ఆయన ఆరోపించారు.

## ఇంజనీర్ల కృషి భవితకు దిక్సూచి

కోట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :



ఒక ప్రాంతం ఏ రంగంలో అభివృద్ధి సాధించాలన్నా ఇంజనీర్ల పాత్ర కీలకమని, ప్రపంచంలోనే అత్యధిక ఇంజనీర్లు ఉన్న దేశాల్లో భారతదేశం ముందు వరుసలో ఉందని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్‌వి.విజయకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ విభాగంలో ఇంజనీర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, అన్ని విభాగాధిపతులు నివాళి అర్పించారు. విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏటా లక్షలాది మంది ఇంజనీర్లు తయారవుతున్నారని చెప్పారు. 1908లో మూసీనదికి వరదలు వచ్చినప్పుడు అల్లకల్లోలమైన పరిస్థితుల్లో అనేక వంతెనలు నిర్మించి మూసీ నదికి పటిష్టమైన ఏర్పాట్లు చేశారని తెలిపారు. 1952లో 91 సంవత్సరాల వయస్సులోనూ గంగా నది మీద బ్రిడ్జి నిర్మాణానికి అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని తెలిపారు. దేశ అభివృద్ధికి విశ్వేశ్వరయ్య ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు టెక్నికల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ డి.శ్రీనివాస్, డాక్టర్ సుబ్బారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్‌అండ్‌బి అధికారులు కంపచెట్లను తొలగించాలి

కోట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :



కోట మండలం కొత్తపాలెం గ్రామం నుంచి కర్లపూడి గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బి రహదారిపై రోడ్డుకు ఇరువైపులా ఏపుగా మూడు కిలోమీటర్ల మేరకు కర్రతుమ్మ చెట్లు పెరిగిపోయి ఉన్నాయని ద్విచక్ర వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం నుంచి రోడ్డుకు ఇరువైపులా కర్రతుమ్మ చెట్లు పెరిగిపోయి ఉన్నా ఆ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని చెప్తున్నారు. దీంతో రోడ్డు మార్గంలో వెళ్లే సమయంలో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించక అనేక సందర్భాలలో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు చెప్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కర్రతుమ్మ చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

## వినాయక ప్రతిమల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

నాయుడుపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :

వినాయక చవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు పోలీసులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందని నాయుడుపేట సీఐలు వైవీ సోమయ్య, నరసింహారావు సూచించారు. శుక్రవారం వారు విలేఖరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖతో పాటు పోలీసుల నుంచి అన్ని అనుమతులు తీసుకోవాలని వివరించారు. ఇతర మతాలకు ఆటంకం కలగకుండా వేడుకలు జరుపుకోవాలని సిఐలు తెలిపారు. నియమావళిని, షరతులను ఉల్లంఘిస్తే కమిటీ సభ్యులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. వినాయక చవితికి విగ్రహం ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు పాటించాల్సిన విధివిధానాలను వివరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే జగనన్నకు చెబుదాం : ఎమ్మెల్యే

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :



ప్రజా సమస్యల పరిష్కారానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని రూపొందించి ప్రజల్లోకి తీసుకొచ్చారని స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శుక్రవారం శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వీలైనంత వరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వాన్ని ప్రజల దగ్గరకు తీసుకురావడమే ఈ కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ బాలాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని, తహశీల్దార్ కె.రవికుమార్, నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్, ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కంటైనర్ బోల్తా

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :



చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళుతున్న భారీ కంటైనర్ శుక్రవారం పట్టణానికి సమీపంలోని హోలీక్రాస్ జంక్షన్ వద్ద బోల్తాపడింది. అడ్డంగా వచ్చిన ఆటోను తప్పించబోయి ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణహాని లేకపోగా, చిన్నపాటి గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయండి

తడ, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :




తడ మండలంలో జరుగుతున్న నాడు-నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.శేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తడలో విద్యాశాఖ అధికారులతో సమీక్ష జరిపారు. అనంతరం నాడు-నేడు పాఠశాలల, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి, సమగ్ర శిక్షా ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, తడ మండల విద్యాశాఖ అధికారులు సరస్వతి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు ర్యాలీ

బాలాయపల్లి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:

ఈ నెల 18న వినాయకచవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన వినాయకుని విగ్రహాలను ఉపయోగించాలంటూ ర్యాలీ చేపట్టిన వరసిద్ధి వినాయక పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మట్టి ప్రతిమలు, ప్లకార్డులు చేతబట్టి నో ప్లాస్టిక్ సేవ్ ఎర్త్ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. విద్యార్థులు, ఎంఈవోలు బీరం ప్రదీప్‌కుమార్, కె.వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ శంకరమ్మ ర్యాలీలో పాల్గొన్నారు. మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజించాలన్నారు.

## ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

బాలాయపల్లి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:

జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చ ఏయాలని ఎంపీడీవో రవీంద్రబాబు కోరారు. వెలుగు కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించిన ఎంపీడీవో రవీంద్రబాబు, డాక్టర్ కళ్యాణ చక్రవర్తి పాల్గొన్న ఈపీవోఆర్‌డి శ్రీనివాసులు, వైద్యాధికారిణి డాక్టర్ ప్రమీల, ఎంఈవవోలు కిల్లా వెంకటేశ్వర్లు, బీరం ప్రదీప్‌కుమార్ అక్టోబర్ 3వ తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తారని తెలిపారు. బాలాయపల్లి 03: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రవీంద్రబాబు

## పోలేరమ్మ జాతర నిర్వహనపై అసత్య ప్రచారాలు

- వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



వెంకటగిరి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:

అక్టోబర్ నెల 4, 5 తేదీల్లో జరగబోవు వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర కొన్ని దుష్టశక్తులు అసత్య ప్రచారాలు చేసఉ్తన్నారని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 1, 25వ వార్డులలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరను సీఎం రాష్ట్ర పండుగగా గుర్తించారని, అది మన అదృష్టమన్నారు. ఈ నెల 13న జాతర నిర్వహణపై సమావేశం జరుగుతుండగా కొందరు సమావేశంపై పని గట్టుకొని అసత్య ప్రచారం చేశారన్నారు. జాతరలో సామాన్య భక్తులకు దర్శకం కల్పించేందుకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తామన్నారు. ఆయన వెంట ఛైర్‌పర్సన్ నక్క భానుప్రియ, వైసీపీ జిల్లా కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, కౌన్సిలర్లు సుబ్బారావు, సుభావళి, వహీదా, గోపాలకృష్ణ, కృష్ణమూర్తి, సుబ్బారావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్న కోసం చండీ యాగం నిర్వహించిన టీడీపీ నేత మస్తాన్ యాదవ్

**వెంకటగిరి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బెయిల్‌పై జైలు నుండి బయటకు రావాలని డాక్టర్ మస్తాన్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సీనియర్ టీడీపీ నేత బొలిగర్ల మస్తాన్ యాదవ్ దంపతులు చండీ యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడుపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని తెలిపారు. ఆయన చరిత్రలో ఎప్పుడు అక్రమాలకు పాల్పడలేదని తెలిపారు. దేశంలో ఉన్న కొద్ది మంది నాయకుల్లో నీతి నిజాయితీ ఉన్న నేత చంద్రబాబునాయుడు ఒక్కరేనన్నారు. కడిగిన ముత్యంలాగా చంద్రబాబునాయుడు జైలు నుండి బయటకు వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు శ్రీనివాసులు, రామచంద్రయ్య, చంద్రయ్య నాయుడు, మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జాయింట్ కలెక్టర్‌చే స్పందన కార్యక్రమం

రామకుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :



రామకుప్పంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు నేతృత్వంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు వివిధ సమస్యలపై 206 వినతిపత్రాలు అందించారు. అంతకుముందు జెసి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలు జిల్లా కేంద్రంకు రాకుండా మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కరించుకునే అవకాశం కల్పించిందన్నారు. ప్రతి బుధ, శుక్రవారాల్లో వివిధ మండలాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల అధికారులు సమస్యలపై పరిష్కారం చూపాలని ఆదేశించారు. అసైన్మెంట్ భూములు సాగు చేస్తున్న సాగుదారుల జాబితాలను గుర్తించి వివరాలు అందించాలని ఆదేశించారు. ఎస్సీ,ఎస్టీ గ్రామాల్లో స్మశాన వాటికలకోసం ప్రభుత్వ భూములు పరిశీలించాలని అవసరం ఉంటే ప్రైవేట్ భూములు గుర్తించి కలెక్టర్ కార్యాలయంకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శివయ్య, డిఆర్‌డిఎ పిడి తులసి, డిపిఒ లక్ష్మి, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి చిన్నారెడ్డి, డిసిఒ బ్రహ్మానందరెడ్డి, డిఇఒ విజయేంద్రరావు, ఎస్ఇ ఉమామహేశ్వరరెడ్డి, డిఎల్‌పిఒ రవికుమార్, తహశీల్దార్ మురళి, ఎంపిడిఒ రాధాకృష్ణ, ఎంపిపి సుబ్రమణ్యం, జడ్‌పిటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి పాల్గొన్నారు.

## పట్టణ వైకాపా అధ్యక్షుడుగా గంగారపు జయరాం

పుంగనూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :



వైకాపా పట్టణాధ్యక్షుడుగా గంగారపు జయరాం నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు పార్టీ రాష్ట్రశాఖ నుంచి నియామక సమాచారం అందింది. మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిధున్‌రెడ్డిల అనుచరుడుగా, వైకాపాలో ప్రధాన సేవలందిస్తున్న జయరాం వ్యాపారవేత్తగా రాణిస్తున్నారు. ఈక్రమంలో ఆయన పట్టణంలో ప్రతి వార్డులోనూ మిత్రులను,సహచరులను,కార్యకర్తలకు అందుబాటులో ఉంటుండడంతో ఆయన సేవలు పార్టీకు అవసరంగా భావించినట్లు పార్టీ ప్రకటించింది. జయరాం నియామకం పట్ల పార్టీ నాయకులుకొండవీటి,వెంకటరెడ్డియాదవ్,ఛైర్మన్‌అలీంబాషా,నాయకులు,కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేశారు.

## అక్రమ మద్యం స్వాధీనం : మహిళ అరెస్టు

**పుంగనూరు,సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో అక్రమ మద్యం, నాటుసారా విక్రయదారులపై అధికారులు ఉక్కుపాదం మోపుతు న్నారు. ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ సీతారామిరెడ్డి అద్వర్యంలో తనిఖీలు,దాడులు ముమ్మరం చేశారు. కర్నాటక మద్యాన్ని విక్రయించే దుకాణాదారులను అదుపులోనికి తీసుకుంటున్నారు. ఈక్రమంలో సోమల మండలంలో నిర్వహించిన దాడులలో వడ్డిపల్లికు చెందిన రెడ్డెప్ప భార్యను అదుపులోనికి తీసుకుని ఆమె ఇంట్లో దాచిపెట్టిన రూ.25వేలు విలువచేసే 768 కర్నాటక మద్యం పాకెట్లు స్వాధీనంచేసుకుని ఆమెను అదుపులోనికి తీసుకున్నారు. ఈదాడులలో ఎస్ఐ అశోక్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓర్పు,సహనాలు స్వర్గానికి బాటలు

హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** మనిషికి ఓర్పు, సహనం,ధన్యవాదాలు స్వర్గానికి మార్గాలని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మసీజిద్‌లో జరిగిన ప్రత్యేక ప్రార్ధనల సందర్భంగా ఆయన మహమ్మద్ ప్రవక్త జననం గురించి వివరిస్తూ ఆయన రాక సందర్భంగా వారి ఇంటిలో ఆకస్మిక వెలుగులు చోటు చేసుకున్నాయన్నారు. ఆయన తల్లి గర్భంలో ఉండగానే తండ్రిని కొల్పోయారని ఆరేళ్ళ వయస్సులో తల్లిని కొల్పోయారని 8 సంవత్సరాల వయస్సులో తాతను కొల్పోయాడన్నారు. అంటే మనల్ని నడిపించే అల్లాహ్ పరీక్షలే అన్నారు. కానీ ఎన్ని కష్టాలు వచ్చినా, కన్నీళ్ల చోటు చేసుకున్నా ప్రవక్తలు అల్లాహ్ మార్గాన్ని విడనాడలేదన్నారు. ఏదీ జరిగినా ఆయన నిర్ణయమే అన్నారు. అల్లాహ్‌సూచించిన మార్గంలో నడవాలని రేహాన్ పిలుపు నిచ్చారు.

## లా కళాశాలలో కాపియింగ్ ఇద్దరు డీబార్



**ఏర్పేడు (శ్రీకాళహస్తి రూరల్),సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** మండలంలోని అంజిమేడు వద్ద నిర్వహిస్తున్న ఓ లా కళాశాలలో కాపియింగ్ పాల్పడి ఇద్దరు డీబార్ అయిన సంఘటన తెలిసింది.ఈ కళాశాలలో జరుగుతున్న పరీక్షల్లో విద్యార్థులు కాపియింగ్‌కు పాల్పడుతున్నారనే ఆరోపణలు జిల్లా కలెక్టర్‌కు అందాయి.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణ ఆదేశాలతో శుక్రవారం తహశీల్దార్ సుద్దాల శివప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేసారు.ఈ సందర్భంగా కాపి చేస్తున్న ఇద్దరిని పట్టుకొని డీబార్ చేసారు.తహశీల్దార్‌తో పాటు రెవెన్యూ ఇన్సెపెక్టర్ సంతోష్ ఇతర అధికారులు పాల్గొన్నారు. నాలగవ సెమిస్టర్ టాక్సేషన్ పరీక్షలు జరుగుతున్నాయని 24 గదుల్లో 692 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తహశీల్దార్‌శివప్రసాద్ వివరించారు.

## నియంత పాలన ఎల్ల కాలం సాగదు: సుధీర్‌రెడ్డి

ఏర్పేడు (శ్రీకాళహస్తి రూరల్),సెప్టెంబర్ 15 ప్రభాతవార్త



ఏ చరిత్ర చూసినా నియంతల పాలన ఎల్లకాలం సాగదని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌వార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం ఏర్పేడు మండల కేంద్రంలో తెలుగుదేశం నాయకులు 'మేమూ సైతం' అనే తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు ఆయా మండల కేంద్రాల్లో రిలేదీక్షలు చేపడుతున్నారు.ఈ నేపథ్యంలో రిలేదీక్షలను చేపట్టిన సందర్భంగా బొజ్జలసుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నేడు రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న నాయకుని పిచ్చి పరాకాష్టకు చేరుకుందన్నారు. ఏ చరిత్రలో చూసినా నియంతల పాలన దారుణంగా అంతం కాకతప్ప దన్నారు. 151 మంది ఎంఎల్‌ఏలను ఇచ్చి పరిపాలించమంటే ప్రతిపక్షాలపై కక్ష సాధింపే లక్ష్యంగా పని చేస్తున్నారని ధ్వజమెత్తారు.నిత్యం రిజర్వ్ బ్యాంకు నుంచి వేల కోట్లు అప్పులు తెచ్చుకుంటూ కనీసం సకాలంలో జీతాలివ్వక వేధిస్తూ నిత్యం ప్రతిపక్షాల పై కక్ష సాధింపే లక్ష్యంగా పని చేస్తూ ఎలాంటి ఆధారాల్లేని కేసులో తెలుగుదేశం పార్టీ నాయకుడు చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేసి తన పాశాచికానందానికి పరాకాష్టగా మార్చుకున్నా రన్నారు. రాష్ట్రంలో రాజు దోచుకుంటుంటే నియోజకవర్గాల్లో సామంతులు దోచుకుంటూ ప్రజలను భయభ్రాంతులౌతున్నారని వివరించారు.ఈ దీక్షల్లో మాజీ జడ్‌పిటిసి పేరం ధనంజయులు నాయుడు,మండల పార్టీ అధ్యక్షుడు పొన్నారావు,తాటిపర్తి ఈశ్వరరెడ్డి, చెలికం పాపిరెడ్డి, బాలాజీనాయుడు, శివశంకర్‌రెడ్డి,మల్లికార్జున్ నాయుడు మిన్నల్ రవి, గాలి మురలినాయుడు, జగదీశ్వరరెడ్డి,హరిబాబు,మాజీ సర్పంచ్ హరిబాబునాయుడుతదితరులు పాల్గొన్నారు

## బాబును వెంటనే విడుదల చేయాలని మసీదులో ప్రార్ధనలు

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ నాయకుడు ప్రజాశ్రేయోభిలాషి నారాచంద్రబాబునాయుడు కష్టాలను తొలగించాలని ఆయన్ను నిర్ధోషిగా బయటకు రావాలని శుక్రవారం రాజీవ్‌కాలనీలోని మస్‌జిద్‌లో ముస్లిం సొదరులు ప్రార్ధనలు జరిపారు.

## కాసరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి బెడ్లు వితరణ



**తొట్టంబేడు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శుక్రవారం జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భరత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల సందర్భంగా మండలంలోని కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు రోగులకు ఉపయోగపడే బెడ్లును వైద్యులకు అందించారు. శుక్రవారం మండలంలోని 27 పంచాయతీల్లో సన్నిహితులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. యువతకు క్రికెట్‌కిట్లు పంపిణీ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రిలను పంపిణీచేశారు.

## సిపిఎంలోకి రాపూరు, సంక్రాంతి



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** సిపిఎం మాజీ కార్యకర్తలు తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. శుక్రవారం రాపూరు సుబ్రమణ్యం, సంక్రాంతి వెంకటయ్యలు స్థానిక పుచ్చలపల్లి సుందరయ్యభవన్‌లో జరిగిన సిపిఎ ప్రాంతీయ నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఇరువురికి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు సమక్షంలో పార్టీకండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు అంగేరిపుల్లయ్య, దాసరిజనార్ధన్, గంధంమణి, పెనగడం గురవయ్య, కుమార్, నాగరాజు, వెంకటేష్, రమేష్, చెంగయ్య, ముకుంద తదితరులు పాల్గొన్నారు

## అరబిందో సేవలను సద్వినియోగం చేసుకోండి



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా అరబిందో, 108సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ హెచ్ ఆర్ బ్రహ్మం అన్నారు. శ్రీకాళహస్తి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన 108 సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా వచ్చిన బ్రహ్మం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. 108 సిబ్బందికి సూచనలు చేస్తూ విధుల పట్ల ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సునిశితంగా హెచ్చరించారు.ఈ సమావేశంలో జోనల్ మేనేజర్ శివ,రాకేష్,డిఎం విజయకుమార్, శ్రీనివాసులు, సంతోష్,ఎంపిడిఓ రఫీఖాన్,కార్యదర్శి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్న కోసం ముస్లిం ప్రార్ధనలు



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** ఆంధ్రరాష్ట్ర ఆధునిక నిర్మాత, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని తెలుగునేలను అభివృద్ధి పథాన నడిపిన నవ్యాంధ్ర రూపశిల్పి తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు మరియు మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఎదుర్కొంటున్న అక్రమ కేసుల నుంచి త్వరగా బయటపడాలని తెలుగుదేశంపార్టీ మైనార్టీ విభాగం తిరుపతి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి షేక్‌జిలానీ ఆధ్వర్యంలో సంతమైదానంలో ఉన్న మసీదు వద్ద సామూహిక ప్రార్ధనలు చేశారు.కార్యక్రమంలో పార్టీ మైనార్టీ విభాగం నాయకులు షాకిరాలీ, అస్మత్, అబ్దుల్‌కరీం, మస్తాన్, జిలానీ, నూర్, ఉస్మాన్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన సేవలను ప్రజలకు అందించాలి : జిల్లా జాయింట్ కలెక్టర్

**తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** ప్రజలకు నాణ్యమైన సేవలను ప్రజలకు అందించడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం అని జిల్లా జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ తెలిపారు. శుక్రవారం సూళ్లూరుపేట మండలంలో సత్యసాయి కళ్యాణ మండపంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ, ఎంఎల్ఏ కిలివేటి సంజీవయ్య, ఆర్‌డిఓ చంద్రమునితో కలిసి జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి సమస్యల అర్జీల స్వీకరణ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై జిల్లా జాయింట్ కలెక్టర్ అప్పటికప్పుడే మండల, జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఎంపిపి అల్లూరు అనిల్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ శ్రీమంత రెడ్డి, డిఎస్పి రాజగోపాల్ రెడ్డి, తహశీల్దార్ రవికుమార్, ఎంపిడిఓ ప్రమీల రాణి, మున్సిపల్ కమిషనర్ నాగశెట్టి నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు మరువలేనివి

రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గోపినాథ్ రెడ్డి



**తిరుపతి (మహిళావర్సిటీ), సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు మరువలేనివి అని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గోపినాథ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 56వ ఇంజనీర్స్ డే సందర్భంగా తిరుపతిలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి రాయలసీమ రంగస్థల ఛైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డితో పాటు, రంగస్థలి సభ్యులు పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాలులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అక్కిపల్లి మునికృష్ణ, సుబ్రమణ్యం యాదవ్, విజయ్ కుమార్‌లు తొండమనాటి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్టు కక్ష సాధింపే : ధనంజయ యాదవ్

**విజయపురం, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అరెస్టు ముమ్మాటికీ కక్ష సాధింపు చర్యేనని టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చుక్కా ధనంజయ యాదవ్ ఆరోపించారు. శుక్రవారం పన్నూరు సబ్‌స్టేషన్‌లో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్ది దేశ వ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చిన వ్యక్తికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అరెస్టు చేశారని తెలిపారు. అనంతరం టిడిపి అధ్యక్షుడు రమేష్‌రాజు ప్రసంగించారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రమణ్యంరాజు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి బాబు యాదవ్, నాయకులు గుణశేఖర్‌రెడ్డి, మునిభాస్కర్‌రాజు, మురళి, శివలింగం, సుధాకర్ రాజు, కపిల్, శ్యామ్, గోవిందయ్య, పరంధామనాయుడు, రామచంద్రారెడ్డి, జయరాజ్, సెల్వం, శరవణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు క్షేమం కోసం మసీదులో ప్రార్ధనలు



పుత్తూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు వైసిపి ప్రభుత్వ అక్రమ కేసుల నుంచి బయటపడాలని కోరుతూ పట్టణంలోని భవానీనగర్ మసీదులో ఆ పార్టీ ముస్లిమ్ మైనార్టీ నాయకులు శుక్రవారం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి రిమాండ్‌కు పంపించడం దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. ఇటువంటి రాక్షస ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలన్నారు. అక్రమ కేసులు హైకోర్టులో కొట్టివేయాలని కోరుతూ ముస్లిమ్ మత పెద్దలతో దువా చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రఫీ అహ్మద్, మహమ్మద్ నబీ, హమీద్ బాషా, శబ్దర్, చాను, జబీర్, గౌస్ బాషా, రసూల్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.ఫోటోలు

## గంగమ్మ తల్లీ నీవే దిక్కు!

–చంద్రబాబు విడుదల కావాలని తెలుగుమహిళల మొక్కులు



**తిరుపతి,సెప్టెంబర్ 15ప్రభాతవార్త:** అక్రమంగా, అన్యాయంగా కుట్రతో కక్షపూరితంగా టిడిపి అధినేత చంద్రబాబునాయుడుపై వైసిపి ప్రభుత్వం పెట్టిన కేసుల్లో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న ఆయన ఆరోగ్యం కాపాడాలని, జైలునుండి విడుదల చేయాలని కోరుతూ తెలుగుమహిళలు తిరుపతి తాతయ్యగుంట గంగమ్మకు పొంగళ్ళు పెట్టి వేయికళ్ళదుత్తలు నెత్తిన పెట్టుకుని మొక్కారు. ఈ ప్రభుత్వానికి త్వరలోనే రాష్ట్రప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని టిడిపి నేతలు సుగుణమ్మ, పుష్పావతియాదవ్, బ్యాంకు శాంతమ్మ, విజయలక్ష్మి, సింధుజ, వసంతమ్మ, మంజుల, కుమారి, దంపూరి రాజ్యలక్ష్మి,ఊకా విజయకుమార్, ఆర్‌సి మునికృష్ణ, బిజి కృష్ణయాదవ్, దంపూరి భాస్కర్, జెబి శ్రీనివాసులు, వట్టికుంట శంకరనారాయణ తదితరులు మూడవరోజు రిలేనిరాహారదీక్షల్లో పాల్గొన్నారు.

## చివరి శుక్రవారం...వేడుకగా లక్షకుంకుమార్చన



**తిరుపతి,సెప్టెంబర్15 ప్రభాతవార్త:** కపిలేశ్వరస్వామివారి ఆలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారం రోజున శ్రీకామాక్షి అమ్మవారికి లక్షకుంకు మార్చన సేవ వేడుకగా జరిగింది.ఇందులోభాగంగా ఉదయం గణపతి పూజ ,పుణ్యాహవచనంతో ప్రారంభించి మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారికి లక్షకుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు చంద్రశేఖర స్వామి, మనోన్మణి అమ్మవారు పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు,సూపరింటెండెంట్ భూపతి టెంపుల్ ఇన్స్‌స్పెక్టర్లు రవికుమార్,బాలకృష్ణ తదితరులుపాల్గొన్నారు.

## రోజూ కూలికి కూడా సాయంత్రమైతే కూలి వస్తుంది!

–నాలుగునెలలుగా జీతాలందని ఉపాధ్యాయులు

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** కుటుంబం గడవటానికి కూలి చేసుకునే వారికి సాయంత్రానికి చేతికి కూలి వస్తుంది.కానీ నాలుగు నెలలుగా జీతాలందక ఉపాధ్యాయులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగామారింది. రాష్ట్రంలో సుమారు 60వేల మంది ఉపాధ్యాయులకు జీతాలందక తిప్పలు పడుతున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. కొందరి తప్పులు, విధానాల్లో లోపాలు, కంప్యూటర్ల మాయాజాలంతో తాము బలి పశువులయ్యామని వాపోతున్నారు. తమ బాధలు ఎవరికిచెప్పుకోవాలో తెలియక తల్లడిల్లు తున్నామని వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో బతకలేక బడిపంతులు ఆనే వారు. నేడు ఆ అక్షరాలు అక్షర సత్యాలుగా మారాయని వివరిస్తున్నారు. జీతం ఎప్పుడు వస్తుందో తెలియదు. నాలుగు నెలల క్రితం ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టారు. దాంతో కొందరు ఉపాధ్యాయులు ఒక్కొక్క చోటకు బదిలి అయ్యారు. అయితే బదిలీ అయిన సందర్భంగా కంప్యూటర్స్‌లో నమోదు కాకపోవటంతో కొందరు ఇబ్బంది పడుతున్నారు. మరి కొందరు ఆ పాఠశాలలో క్యాడర్ సంఖ్యకు సంబందించిన వివరాలు నమోదు కాలేదని తల్లడిల్లుతున్నారు. ఇలా ఒక్కొక్కరికి ఒక్కొక్క టెక్నికల్ అంశంతో జీతాలు రాలేదని చెబుతున్నారు.ఇప్పటికైనా పాలకులు స్పందించి ఉపాధ్యాయుల మానసిక వేదనను సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## తెలుగుపండితులు హఠాన్మరణం

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త



శ్రీకాళహస్తికి చెందిన తెలుగుపండితులు,కవి,రచయిత,సామాజిక వేత్త, దార్శనికుడు, రసజ్ఞ సమాఖ్య అధ్యక్షులు లగడపాటి భాస్కర్ (80) శుక్రవారం హఠాన్మరణం చెందారు. ఆయన మృతికి రాజకీయ నాయకులు, పండితులు, యువత సంతాపాలు తెలిపారు. శ్రీకాళహస్తికి చెందిన లగడపాటి భాస్కర్ తెలుగు లెక్చరర్‌గా పని చేసారు.స్వతహాగా పండితులైన లగడపాటి భాస్కర్ ఎన్నో ఆధ్యాత్మిక చింతన కల్గిన పుస్తకాలను రచించారు. అంతేకాక ఇక్కడ నిర్వహించే కవిసమ్మేళనాలు,శివరాత్రి కార్యక్రమాల్లో ప్రధాన భూమిక నిర్వహించే వారు.అష్టావధానాల్లో ఆయన ప్రముఖంగా కనబడే వారు. ఆయన చివరి నిముషం వరకు ధార్మిక చింతనకే అంకితమయ్యారు.ఆయన మృతికి మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, మాజీ ఛైర్మెన్ కోలా ఆనంద్‌కుమార్,ఆయనతో పాటు మరో తెలుగు ఉపాధ్యాయులు,కవి గోడుగు చింత గోవిందయ్య,విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బూడిదవాకం వెంకయ్య, పురుషోత్తం, యుగంధర్‌రాజు, పి.మునిసుబ్బారెడ్డి, గురునాధం, గణేష్, రమేష్,పి.స్వర్ణమూర్తి తదితరులు నివాళులర్పించారు.వారి కుటుంబానికి సంతాపం తెలిపారు.

## బాల్యవివాహాలు లేని సమాజాన్ని స్థాపిస్తాం

–రాష్ట్ర బాలల హక్కు కమిషన్ ఛైర్మన్, సభ్యులు



తొట్టంబేడు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : బాల్యవివాహాలు లేని సమాజాన్ని స్థాపిస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలిఅప్పారావు, సభ్యులు గొండుసీతారాం, ఆదిలక్ష్మి త్రిపర్ణ, బి.పద్మా వతిలు అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలం ఐసిడిఎస్ ఎంపిడిఓ కార్యాలయంలో బాల్యవివాహాలపై మహిళా పోలీసులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కె.అప్పారావు మాట్లాడుతూ 'బాల్యవివాహాలు లేని నవసమాజం నిర్మాణం' చేపట్టాలని కోరారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లయితే ఐసిడిఎస్ అధికారులకు లేదా బాలల హక్కుల కమిషనర్‌కు పిర్యాదు చేయవచ్చు న్నారు.వార్డు సచివాలయ మహిళా పోలీసులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరిలు పాల్గొన్నారు

## అంగన్‌వాడీ టీచర్లు బాధ్యతతో పనిచేయాలి

**తొట్టంబేడు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి ప్రాజెక్టు పరిధిలోని శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తి రూరల్, తొట్టంబేడు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు బాధ్యతతో పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలిఅప్పారావు అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. శుక్రవారం శ్రీకాళహస్తి. తొట్టంబేడు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు బాధ్యతతో పనిచేయాలని ప్రీప్రైమరీ స్కూల్‌గా మార్చారన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగాలు సంపాదించడం ఎంతో కష్టమని అయితే ఉద్యోగాలు వచ్చిన వారు బాధ్యతగా పనిచేయడం నేర్చుకోవాలన్నారు.సభ్యులు గొండుసీతారాం, ఆదిలక్ష్మి త్రిపర్ణ, బి.పద్మావతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, పలువురు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## బ్రాహ్మణ సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులుగా నాగరాజుశర్మ

**నగరి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులుగాను, నియోజకవర్గ అధ్యక్షులుగా నగరి పట్టణానికి చెందిన తుళా నాగరాజుశర్మ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు అరిపిరాల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సంజీవ నవీన్‌కుమార్ శర్మ నుంచి శుక్రవారం ఆయనకు నియామక పత్రాలు అందాయి.

## 67వ స్కూల్ గేమ్స్‌కు మండల స్థాయిలో పోటీలు



**నగరి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** 67వ స్కూల్‌గేమ్స్‌లో భాగంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అండర్–14, 17 బాల బాలికలకు మండల స్థాయి కబడ్డీ, యోగా టోర్నీ, నియోజకవర్గ స్థాయి సెలెక్షన్స్ నిర్వహించగా స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో అండర్–14,17 బాల బాలికలకు మండల స్థాయి వాలీబాల్ పోటీలు నియోజకవర్గ స్థాయి సెలెక్షన్స్ నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవోలు శ్రీదేవి, నమఃశివాయ, ప్రధానోపాధ్యాయులు పార్వతీదేవి, శ్యామలాదేవి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.

## ప్రజల కోసం పుట్టిన నేత జగన్మోహన్‌రెడ్డి : ఎమ్మెల్యే

రేణిగుంట, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:



ప్రజల కోసం పుట్టిన నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. రేణిగుంట పంచాయతీ వేణుగోపాలపురం, శివకుమార్ నగర్‌లలో గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే ఇంటింటిని సందర్శించారు. జనం ఆయనకు బ్రహ్మరథం పట్టారు. మహిళలు ఎదురేగి మంగళ హారతి ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎంత మందిఏకమైన ప్రజానేత జగన్మోహన్‌రెడ్డిని ఓడించలేరని ధీమా వ్యక్తం చేశారు. జనం కోసం పుట్టిన నేతగా ముఖ్యమంత్రిని అభివర్ణించారు. గడపగడపకు తిరిగిన వారిలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, తహసీల్దార్ ఉదయ్ సంతోష్, ఈవోపీఆర్‌డీ వెంకటరత్నమ్మ, రేణిగుంట సర్పంచ్ నాగేషం, వైసీపీ సీనియర్ నేతలు జువ్వల దయాకర్‌రెడ్డి, యోగీశ్వర్‌రెడ్డి, గాజుల మండ్యం సర్పంచ్ డా. గంగారి రమేష్, ఎంపీటీసీలు జువ్వల ధనంజయరెడ్డి, శశికిరణ్, తూకివాకం సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి, వైసీపీ యువనేత సందీప్‌రెడ్డి, జిల్లాముస్లిం మైనారిటీ అధ్యక్షుడు మహ్మద్ రసూల్, ముస్లిం మైనారిటీ నేతలు అబ్దుల్ ఖాదిర్, షబ్బీర్ అహ్మద్, ఇరానీ ఖాదిర్, మహిళా నాయకురాలు అరుణాదేవి, స్థానిక నేతలు రమణ, నాగరాజు, పలువురు ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, వైసీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## చంద్రబాబుకు అండగా నిలుస్తాం..! : పులివర్తి నాని

చంద్రగిరి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:



కష్ట కాలంలో చంద్రబాబుకు ప్రతి ఒక్కరూ అండగా నిలుస్తామని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. బాబుతో నేను సైతం అంటూ శుక్రవారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద యర్రావారిపాళ్యంకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నిరాహార దీక్ష పట్టారు. ఈ కార్యక్రమానికి సంఘీబావం తెలిపిన పులివర్తి నాని మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టులో సహేతుకమైన ఆధారాలు లేవన్నారు. వంద శాతం కక్షపూరితంగా అరెస్ట్ చేసినట్లు ఇప్పటిఐ స్పష్టమైయ్యిందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో వైసిపికి, ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్దంగా వున్నారన్నారు. నారా చంద్రబాబు నాయుడుకు వెంటనే బెయిల్ లభించాలని ప్రార్దిస్తూ టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి నారావారిపల్లి మహిళలతో కలసి మ్రొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం జోరు వానలో సైతం మొక్కవోని ఆత్మ విశ్వాసంతో చంద్రబాబుకు మద్దతుగా టిడిపి నాయకులు, కార్యకర్తలు దీక్షలో నిమగ్నమయ్యారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీబావం ప్రకటించారు.

## వయోవృద్ధుల ఆకలితీర్చిన అన్నా చెల్లెలు

చంద్రగిరి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:



భూమిరెడ్డి తిషా ంత్ రెడ్డి, భూమిరెడ్డి దేవాన్షి రెడ్డి అన్నా చెల్లెలు శుక్రవారం వయోవృద్ధులకు అన్నదానం చేశారు. తమ కుమారుడు కుమార్తె జన్మదినోత్సవాలను (సెప్టెంబర్ 14, 15) పురస్కరించుకుని భూమిరెడ్డి భవాని నరేష్‌కుమార్ రెడ్డి దంపతులు ఎటువంటి వేడుకలు జరుపుకోవద్దని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో భూమిరెడ్డి సంపూర్ణమ్మ, జయచంద్ర, లలిత, లక్ష్మీ, చిన్ని, హరీష్ (సాయి), వినయ్, ప్రియదర్శిని, మల్లికార్జున, ఈశ్వరి, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ చిరునామా చంద్రబాబు

– టిడిపి దీక్షకు "ప్రవాస భారతీయుడు బద్రీనాధ్ లంకెళ్ల మద్దతు



**చంద్రగిరి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీకి చిరునామా చంద్రబాబు మాత్రమేనని టిడిపి నిరాహార దీక్షకు ప్రవాస భారతీయుడు చంద్రగిరికి చెందిన బద్రీనాథ్ లంకెళ్ళ శుక్రవారం తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. యుఎస్‌ఏలోని విస్కాసిన్ రాష్ట్ర డెమొక్రటిక్ పార్టీ అధికార ప్రతినిధి, విస్కాసిన్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్, యూనివర్శిటీ విస్కాసిన్ సభ్యుడు, ట్రాన్స్‌పోర్టేషన్ సభ్యుడు, అక్కడి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి అయిన బద్రీనాథ్ లంకెళ్ళ చంద్రబాబు అక్రమ అరెస్టును ప్రపంచంలోని తెలుగు వారందరూ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబుకు వెంటనే బెయిల్ లభించాలని ఆకాంక్షిస్తూ నిరాహాదీక్షలో కూర్చున్న పార్టీ ఇన్‌చార్జ్ పులివర్తి నానిని తన తల్లి లంకెళ్ళ లలితతో కలసి సన్మానించి, సంఘీబావం ప్రకటించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో చంద్రబాబు విజయం సాధించి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు.

## క్రీడా స్ఫూర్తితో రాణించాలి : ఎంఈఓ



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో క్రీడలలో రాణించాలని ఎంఈఓ మార్కండేయులు అన్నారు. శుక్రవారం నెత్తకుప్పం జడ్పీ హై స్కూల్ క్రీడా ప్రాంగణంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు, ఎంపికలు నిర్వహించారు. మండలంలో 9 ఉన్నత పాఠశాలలకు చెందిన 250 మంది క్రీడాకారులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రో బాల్, టెన్నీకాయిట్, యోగా, అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొన్నారు. వీరిలో 148 మంది క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 జయవేలు, హెచ్‌ఎం తులసి కుమారి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి సుబ్రమణ్యం రెడ్డి, పిడిలు రామకృష్ణ, సురేష్, గోపినాథ్, దేవరాజ్, భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా "మోక్షగుండం విశ్వేశ్వరయ్య" జయంతి వేడుకలు

చంద్రగిరి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:



మోక్షగుండంవిశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం చంద్రగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్. సుకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఆర్ఎల్ సైంటిస్ట పి.మునిరాజ, విభాగాధిపతులు డాక్టర్ పి.నాగేంద్ర, డాక్టర్ పి.భక్తవత్సలం, డాక్టర్ టి.నరశింహా రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుడిని పూజిద్దాం : జిల్లా కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :



మట్టి వినాయకుడిని పూజిద్దాం పర్యావరణను కాపాడుకుందామని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక తుడా మైదానం ఇండోర్ స్టేడియంలో శ్రీ వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ఆహ్వానం మేరకు జిల్లా కలెక్టర్ హాజరై విఘ్నేశ్వరునికి పూజలు చేసి, మట్టి వినాయకుడిని పూజిద్దాం – పర్యావరణాన్ని కాపాడుదాం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకుందామని నగరంలో టిటిడి మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో వినాయక నిమజ్జన కార్యక్రమాలు జరగనున్నాయని అందుకు సహకరించాలని అన్నారు. ఈ సమావేశంలో తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ప్రతినిధులు చామంచి శ్రీనివాస్, భాను ప్రకాష్ రెడ్డి, గుండాల గోపినాథ్, నవీన్ కుమార్ రెడ్డి, మునికృష్ణ, గోపాల్ రెడ్డి, గోపి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ సంకల్పానికి

నామట్టి నా దేశంకు బిజెపి నేతల సహకారం



**తిరుపతి,సెప్టెంబర్ 15ప్రభాతవార్త:** స్వాతంత్ర్యసమరయోదుల స్మారకార్థం ఢిల్లీలో నిర్మిస్తున్న స్మృతివనం కోసం దేశంలోని అన్ని ప్రాంతాల్లో మట్టిని, బియ్యాన్ని సేకరించి పంపుతామని బిజెపి తిరుపతి నాయుకులు గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, పొన్న విజయకుమార్‌రెడ్డి, అక్కినపల్లి మునికృష్ణయ్యయాదవ్,కవిత తెలిపారు. ప్రదాని మోదీ పిలుపుతో మహత్తర చేపట్టామని, రేపు నెలలో ఢిల్లీలో జరిగే అమృతవనం నిర్మాణంలో వీటిని ఉపయోగి స్తామన్నారు.

# విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలనతో విజేతలవుతారు : టిటిడి విద్యాధికారి

**పుత్తూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :**
కాలేజీ జీవితం ఎంతో విలువైనదని, కాలేజీలో క్రమశిక్షణ, సమయపాలన పాటించిన వారు జీవితంలో విజేతలవుతారని టిటిడి విద్యాధికారి డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి అన్నారు. స్థానిక డిగ్రీ కాలేజీలో శుక్రవారం జరిగిన కాలేజీ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఉన్నత ప్రమాణాలతో బోధించే అధ్యాపకులు, చక్కని మౌలిక సదుపాయాలు వున్నాయని వీటిని విద్యార్థులు, వారి తల్లితండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుత్తూరు డిఎస్పీ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలేజీ జీవితంలో తెలిసి, తెలియక చేసే తప్పుల వల్ల పోలీస్‌స్టేషన్, కోర్టులకు వెళితే భవిష్యత్ పాడైపోతుందని, అందువల్ల విద్యార్థులు జాగ్రత్తగా జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని తెలిపారు.



పుత్తూరు మునిసిపల్ వైస్ ఛైర్మన్ డి.జయప్రకాశ్ మాట్లాడుతూ కెజి నుంచి పిజి వరకూ విద్యార్థులు చదువుకునేందుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ వసతి, ఫీజు రీఎంబర్స్‌మెంట్ వంటి సౌకర్యాలు అందిస్తోందని తెలిపారు. కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పాఠ్యాంశాలతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం కాలేజీలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. స్టూడెంట్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ వి.వీరయ్య వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.రవి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కోటేశ్వరయ్య, ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపల్స్ డాక్టర్ గోపాల్‌రెడ్డి, ఎ.రఘుపతి, కె.శ్రీధర్, స్వరూప, చంద్రమ్మ, చంద్రకళ, కాలేజీ అధ్యాపకులు డాక్టర్ ఆర్.బి.వాణిశ్రీ, టి.నరసింహులు, డాక్టర్ పి.సుజన తదితర అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## మా పొత్తులపై మీకెందుకు ఉలికిపాటు : ఎస్వీవీ

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :**



రాజకీయంగా ఎత్తులు, పొత్తులు ఉంటాయని మా పార్టీల పొత్తులతో వైకాపా నాయకులకు ఎందుకు ఉలికిపాటని మాజీ ఎంఎల్ఏ ఎస్వీవీనాయుడు ప్రశ్నించారు. మీరే సింహం సింగల్‌గా వస్తుందని ప్రకటించుకుని ఇప్పుడెందుకు తత్తరపాటని ప్రశ్నించారు. రాష్ట్రంలో నెలకొన్న అరాచకపాలనను తుదముట్టించాల్సిన సమయం ఆసన్నమైందని అందుకే నిరాధారణ ఆరోపణలతో చంద్రబాబునాయుడను అరెస్టుచేసి తమగోతిని వారే తవ్వుకున్నారని ఎస్వీవీ ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన నివాసంలో పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో పరిస్థితులను చూస్తుంటే ఎక్కడున్నాం, ఏం జరుగతోందో తెలియని పరిస్థితి అని ఇది ప్రజాస్వామ్యమా లేకా రాచరిక పాలన అని సందేహం వేస్తుందన్నారు. విజన్ కలిగిన నాయకున్ని ఎఫ్ఐఆర్ లేకుండా అరెస్టు చేయడం దారుణం అన్నారు. ఒక సామాన్యుడికి ఇచ్చే గౌరవం కూడా ఇవ్వలేని చంద్రబాబునాయుడును అరెస్టుచేయడం దారుణం అన్నారు. తప్పుచేస్తే అరెస్టు చేయడంలో తప్పులేదని కానీ కక్షపూరిత దోరణితో రాజకీయంగా వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. మనం ఉంటామని వ్యక్తులు, వ్యవస్థలు, రాజకీయాలు ఉంటాయా రేపు మనం నేర్పిస్తే కక్షలు, దౌర్జన్యాలుతో రాష్ట్ర భవిష్యత్తు ఎలా ఉంటుందో ఊహించుకోలేమన్నారు. నేడు హైదరాబాదులో కూడా ఐటి ఉద్యోగులు కూడా ధర్నా చేశారన్నారు. నేడు హైదరాబాదు అభివృద్ధి చెందిందంటే అది ఒక్క విజన్ కలిగిన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుతోనే అన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రైతులను ఒప్పించి 30వేల ఎకరాల భూమిని సేకరిస్తే నాడు ప్రతిపక్షంలో ఉన్న నాయకుడు, నేటి సిఎం జగన్‌రెడ్డి రాజధాని నిర్మాణానికి 30వేలు ఎకరాలు కావాలని చెప్పింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రాజధాని లేని రాష్ట్రం ఒక్క ఆంధ్రప్రదేశ్‌ది మాత్రమే అన్నారు. తెలుగుదేశం, జనసేన పొత్తుతో జగన్‌సేనను చిత్తుచేస్తామని ఇవేకాకుండా సిపిఎం, సిపిఐ, ఇతర రాజకీయ పార్టీలకందరికీ శత్రువు ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అన్నారు. నియోజకవర్గంలో పరిశ్రమలు వచ్చాయంటే అవి మాజీ ముఖ్యమంత్రి చలవే అన్నారు. తిట్లపురాణంతో పెద్దలు కాలేరని తాను, బొజ్జలగోపాలకృష్ణారెడ్డి రెండుసార్లు పోటీచేసినా ఎవరు ఎవరిని తిట్టుకోలేదన్నారు. అనవసరంగా యువత కేసుల్లో ఇరుక్కోవద్దన్నారు. టిక్కెట్టు ఎవరికి ఇచ్చినా గెలుపుకోసం కృషిచేస్తామన్నారు. రెండు రోజుల క్రితం సోషల్‌మీడియాలో తెలుగుదేశంపార్టీ అభ్యర్థి ఎస్వీవీనాయుడు అని హల్‌చల్ చేసిందని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెప్తు ఇది తనకు కూడా తెలియదని ఎవరో కావాలనే తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. సమావేశంలో తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, నాయకులు నారాయణయాదవ్, బాస్కర్‌నాయుడు, మాజీ సర్పంచ్ హరినాయుడు, జానకిరామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో నూతన రహదారులను తీసుకురావడమే ప్రభుత్వం లక్ష్యం

–ఎమ్మెల్యే, టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి



**తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :**
తిరుపతి నగరంలోనూతన రహదారులను తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే, టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 4 కోట్ల 78 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు సిసి రోడ్లను, డ్రైన్లను టిటిడి చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో తిరుపతిలో ఒక వైపున అభివృద్ధి, మరో వైపున సంక్షేమంతో దూసుకుపోతున్నదన్నారు. నగరంలో ఇరుకైన రోడ్లులో ప్రయాణించేందుకు వీలు కాలేనటువంటి రహదా రులను వెడల్పు మార్గాలుగా తయారు చేసి ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ కొర్లగుంట జంక్షన్ నుండి కొత్తపల్లి జంక్షన్ వరకు 40 అడుగుల మాస్టర్ ప్లాన్ సిసి రోడ్డు కాలువలను 2 కోట్ల 81 లక్షలతో నిర్మించిన వాటిని ప్రారంభించడం జరిగిందని, అదే విధంగా కరకంబాడీ రోడ్డు హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద నుండి నలందా స్కూల్ వరకు 1 కోటి 97 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు, కాలువలను ప్రారంభించడం జరిగిందన్నారు. తిరుపతి అభివృద్ధికి కావాల్సిన అన్ని రకాల చర్యలను కౌన్సిల్ అనుమతితో చేపడుతామని మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత తెలిపారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ నిరంతరం నగరాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఇటు అధికారులతో అటు ప్రజలతో మమేకమై పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథ రెడ్డి, ఆధం రాధాకృష్ణ రెడ్డి, బోకం అనిల్ కుమార్, తిరుపతి మునిరామిరెడ్డి, శేఖర్ రెడ్డి, దూది కుమార్, కోఆప్షన్ సభ్యులు వెంకటరెడ్డి, ఇమామ్ సాహెబ్, నాయకులు ఏడిఆర్, దేవదానం, పాముల రమేష్ రెడ్డి, తలారి రజేంద్ర, నాగిరెడ్డి, దూది శివ, చోటా ఖాసీమ్, సాకం ప్రభాకర్, వెంకటేష్ రాయల్, దినేష్ రాయల్, లడ్డీ వెంకటేశ్వర్లు, గోపాల్ రెడ్డి, గీతాయాదవ్, శాంతారెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈ సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోక్సోకేసులో నిందితుడికి జీవితశిక్ష

**సూళ్ళూరుపేట(తిరుపతి), సెప్టెంబర్ 15ప్రభాతవార్త:**
కన్వెన్షన్ బేస్డ్ పోలీసింగ్ (పిటి)కేసుల విధానం అమలుచేయడంలో తిరుపతి జిల్లా పోలీసులు సత్ఫలితాలు సాధిస్తున్నారని, ఫోక్సో,ఎస్‌సి,ఎస్‌టి కేసులో నేరస్థుడికి జీవితజైలుశిక్ష ,25వేల రూపాయలు జరిమానా విధించేలా నెల్లూరు ఫోక్సోకోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నాయుడుపేట పోలీస్ సబ్‌డివిజన్, సూళ్ళూరుపేట పోలీసు సర్కిల్ పరిధిలో మన్నార్‌పోలూరు గ్రామానికి చెందిన ఏడుసంవత్సరాల ఎస్‌సి కుల బాదితురాలిని అదే గ్రామానికి చెందిన రవి 2019లో అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పట్లోనే పోలీసులు పోక్సో,ఎస్‌సిఎస్టీ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టుచేశారు. ఈ కేసు నెల్లూరు పోక్సోకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది, ఈ కేసులో సాక్షులు, పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి జీవితజైలుశిక్ష, 25వేల రూపాయలు జరిమానా విధించారని పోలీసులు తెలిపారు. ఇలాంటి కేసుల్లో సాక్ష్యాలు, ఆధారాలు సేకరించి నిందితులకు శిక్ష పడేలా చూడాలని రాష్ట్ర డిజిపి రాజేంద్రనాదరెడ్డి, జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి ప్రత్యేకంగా ఆదేశాలిచ్చారు. సూళ్ళూరుపేట పోలీసులను జిల్లా ఎస్‌పి అభినందించారు.

## రాజకీయంగా ఎదుర్కోలేకనే అక్రమ కేసులు

**– మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మీ**

**వెంకటగిరి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:**
మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఎదుర్కోలేకనే వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మీ ఆరోపించారు. ఆయనను విడుదల చేయాలని వెంకటగిరిలో టీడీపీ నాయకులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు నాయుడు ప్రమేయం లేదని అధికారులు చెబుతున్నా కక్షతో సీఎం జగన్మోహన్‌రెడ్డి కేసు పెట్టించారన్నారు. చంద్రబాబునాయుడు అవినీతి మచ్చ లేని నాయకుడని తెలిపారు. రోజు రోజుకు ప్రజాదరణ పెరుగుతుండడంతో వైసీపీ ప్రభుత్వం తట్టుకోలేక ఇబ్బంది పెడుతుందన్నారు. 2024 ఎన్నికల్లో వైసీపీ పార్టీ గల్లంతవుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదన్నారు. చంద్రబాబునాయుడుని విడుదల చేసే వరకు పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్యనారాయణ, కె.వి.కె.ప్రసాద్‌నాయుడు, చంద్రమౌళిరెడ్డి, ఏలేశ్వరం రామచంద్రనాయుడు, కోటేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, వెంకటాచలం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ద్రవిడ వర్సిటీ వ్యవస్థాపక లక్ష్యాల దిశగా పనిచేస్తోందా..?

**– వర్సిటీలో మరోమారు త్రిమెన్ కమిటీ విచారణ**

**కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :**



ద్రవిడ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక లక్ష్యాల దిశగా పనిచేస్తోందా అని ఆచార్య చంద్రశేఖర్‌రెడ్డి బృందం ద్రవిడ విశ్వవిద్యాలయంలో విచారణ చేపట్టింది. ద్రవిడ వర్సిటీలో నెలకొన్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ఆచార్య చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో త్రిమెన్ కమిటీని నియమించిన విషయం విదితమే. ఈ కమిటీ గత ఆగస్టు నెల21,22 తేదీల్లో వర్సిటీలో పర్యటించి క్షేత్రస్థాయిలో వాస్తవాలు అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం మరోమారు ఈ కమిటీ విచారణ చేపట్టింది. వర్సిటీలోని భాషా భవన్‌ను పరిశీలించారు. తెలుగు, ఆంగ్లం, తమిళం, లింగ్విస్టిక్, ఫోక్‌లోర్ శాఖలను పరిశీలించి ఈ శాఖల పరిధిలో చదువుతున్న విద్యార్థులు సాధించిన ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వర్సిటీలో వేతనాల కోసం సమ్మెకు దిగిన తాత్కాలిక ఉద్యోగుల వ్యవహారంపై సైతం వర్సిటీ అధికారులను విచారించినట్లు సమాచారం. కాగా శనివారం సైతం త్రిమెన్ కమిటీ మరింత విచారణ చేపట్టనుంది. ఈ విచారణల అనంతరం వర్సిటీ ప్రస్తుత స్థితిగతులపై ఆచార్య చంద్రశేఖర్‌రెడ్డి బృందం రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందించనుంది. మొత్తానికి యూనివర్సిటీ భవిష్యత్తు త్రిమెన్ కమిటీ ప్రభుత్వానికి అందించే నివేదికపై ఆధారపడి ఉందనడంలో సందేహం లేదు.

## స్మృతివనానికి నియోజకవర్గం నుంచి పవిత్ర మట్టి

**పుంగనూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :**



మంచివారికి మారుపేరైన పుంగనూరు నియోజకవర్గం నలుమూలల నుంచి సేకరించిన పవిత్రమైన మట్టిని ఢిల్లీలో అమరవీరుల స్మృతివనానం కోసం పంపే కార్యక్రమం పూర్తి చేస్తున్నట్లు బిజెపి కన్వీనర్ గన్నామదన్‌మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన అధ్వర్యంలో పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, పులిచర్ల, రొంపిచర్ల ప్రాంతాల నుంచి సేకరించిన పవిత్రమైన మట్టిని సేకరించి ఢిల్లీ పంపేందుకు కార్యక్రమాలను పూర్తిచేశారు. మదన్‌మోహన్ మాట్లాడుతూ నియోజకవర్గం లోని ప్రతి గ్రామనివాసి కూడా తమ గ్రామానికి చెందిన మట్టి ఢిల్లీలోని అమరవీరుల,స్వాతంత్ర్యవీరుల స్మారకంలో ఉపయోగపడిందన్న భావనతో ఉప్పొంగిపోవాలన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరయోధులకు కృతజ్ఞతాంజలిగా ఈదేశం అందించే ఒక నివాళి,ఈమట్టి సమర్పణ అన్నారు. కార్యక్రమాలలో నియోజకవర్గంలోని ప్రతి మండలంలోనూ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారని,అందరి సహకారంతోనే ఈ మహత్తర కార్యాన్ని పూర్తిచేసి ఢిల్లీ పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షులు విశ్వనాధంనాయుడు,వెంకటరమణ,సుధారాణి, మల్లిక,కార్యదర్శి నానబాలకుమార్,కిసాన్‌మోర్చా మనోహర్,సోషియల్ మీడియా నవీన్‌కుమార్, చౌడేపల్లినుంచి గణేష్,సోమల నుంచి రామమూర్తి,తదితరులతో ప్రతి ప్రాంతంలోని మాజీ సైనికులను,స్వాతంత్ర్యసమరయోధులను సత్కరించారు.

## అమరలో అరుదైన శస్త్ర చికిత్స

**రేణిగుంట, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:**



రేణిగుంట మండలం కరకంబాడి అమర ఆస్పత్రిలో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. 56 సంవత్సరాల మహిళ కడుపు ఉబ్బరం విపరీతమైన వాంతులతో అమర ఆస్పత్రిని ఆశ్రయించింది. వైద్యులు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి కడుపులో 3.5 కేజీలు ప్లీనం పెరిగినట్లు నిర్ధారించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ వైద్య నిపుణులు డా.మునికృష్ణ తమ వైద్య బృందంతో అతిక్లిష్టమైన సర్జరీ చేసి ప్లీనంను తొలగించారు. ఆమెను ఆరోగ్యవంతంగా డిశ్చార్జ్ చేశారు. జీర్ణాశయంలో క్యాన్సర్ తదితర ఎలాంటి సమస్యలకైనా లాప్రోస్కోపి ద్వారా చికిత్స అందిస్తామని డా. మునికృష్ణ తెలిపారు. శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించిన వైద్యులను అమర యాజమాన్యం తరపున చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ వేణుగోపాల్ అభినందించారు.

## హోంగార్డ్ కుటుంబ సభ్యులకు సిబ్బంది సహకారం

**–హోంగార్డు సతీమణికి రూ. 5 లక్షలు అందజేసిన ఎస్పి పరమేశ్వర రెడ్డి**

**తిరుపతి క్రైం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :**



తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి దేవస్థానంలో పనిచేస్తూ అనారోగ్యం కారణంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన హోంగార్డ్ కుటుంబ సభ్యులకు సహచర హోంగార్డులందరూ ఒక్క రోజు వేతనాన్ని ఆర్థిక సహాయంగా అందించి, తమ ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. కష్టకాలంలో ఉన్న దివంగత హోంగార్డు కుటుంబాన్ని ఆదుకోవాలనే సదుద్దేశంతో జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులందరూ ఒక్కరోజు వేతనాన్ని ఇచ్చారు. మంచి మనసుతో మంచి కార్యక్రమానికి ముందుకు వచ్చిన హోంగార్డ్స్ అందరికీ జిల్లా ఎస్పి కృతజ్ఞతలు తెలిపారు. తన నుంచి ఎలాంటి సహాయమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నానని, నా పరిధిలో ఉన్న ఎటువంటి సహాయమైనా హోంగార్డు సంక్షేమంలోభాగంగా తప్పకుండా అందిస్తానని జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డి తెలిపారు. విధి నిర్వహణలో చనిపోయినటువంటి హోంగార్డు జి. నరేష్ బాబు సతీమణికి 5లక్షల రూపాయిలు చెక్కును తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అందజేసారు. అనంతరం కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాన్ని కూడా కల్పిస్తానని ఆమెకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి అడ్మిన్ వెంకట్రావు, హోంగార్డ్స్ ఆర్ఐ శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారి కోసం నా మట్టి నాదేశం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :**



దేశంకోసం ప్రాణాలర్పించిన వారి గుర్తింపు కోసమే 'నా మట్టి–నా దేశం' కార్యక్రమం అని రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ అన్నారు. డిల్లీలో నిర్మిస్తున్న అమృతవాటిక నిర్మాణం కోసం పంపనున్న అమృత కలశాలుతో శుక్రవారం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కోలా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూదేశచరిత్ర తెలుసుకుని దేశం కోసం ప్రాణత్యాగం చేసి అమరులైన నాయకుల స్మరణ కోసం దేశరాజధాని డిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం సమీపంలో అమృత్ వాటిక నిర్మించనున్నారని ఆనంద్ తెలిపారుకార్యక్రమంలోపట్టణఅధ్యక్షులుగరికపాటి రమేష్‌బాబు, తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్‌చంద్రప్ప, మాజీ రాష్ట్ర కార్యదర్శి కండ్రిగ ఉమ,పార్టీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

**–ఎంపిడిఓ వెంకట నారాయణ**

**తిరుపతిరూరల్, సెప్టెంబర్15 ప్రభాతవార్త:**



ఆయా గ్రామ పంచాయతీల కార్యధర్శులు, వైద్య సిబ్బంది ప్రజా ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని తిరుపతి రూరల్ ఎంపిడిఓ వెంకటనారాయణ సూచించారు. శుక్రవారం ఎంపిడిఓ సమావేశ మందిరములో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటి ఆరోగ్య వివరాలను సేకరించాలని ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగ్యూ కేసులు అక్కడక్కడ నమోదు అవుతున్నాయని ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇవో పిఆర్డీ గిరిధర్‌రెడ్డి, పంచాయతీ కార్యధర్శులు, ఎఎన్ఎంలు, ఎంఇఓ, ఎపిఎంలు పాల్గొన్నారు.

## సమస్యలు తెలుసుకుంటూ ముందుకు!

**తిరుపతిరూరల్, సెప్టెంబర్15 ప్రభాతవార్త:**



జగనన్న ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ.....స్థానిక ప్రజలు తెలిపే ప్రజా సమస్యలను సావధానంగా వింటూ....ప్రజా సమస్యలనే అక్కడిక్కడే పరిష్కరిస్తూ ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి లక్ష్మీ లింగేశ్వర్‌నగర్‌లో ముందుకు సాగారు. శుక్రవారం లింగేశ్వర్‌నగర్‌లో రెండో జరిగిన గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో చెవిరెడ్డి లక్ష్మీ పాల్గొన్నారు. గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమానికి విచ్చేసిన లక్ష్మీకి లింగేశ్వర్‌నగర్ సర్పంచ్ ముసుకు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అపూర్వ ఆదరణ లభించింది. ఈ కార్యక్రమంలో లింగేశ్వర్‌నగర్ గ్రామ సర్పంచ్ ముసుకు కోటేశ్వరరావు, పంచాయతీ కార్యధర్శి విజయ నిర్మల, యువనేత సాయిరాయిల్, వైకాపా నాయకులు రవి, పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## భక్తులను ఆకట్టుకునేలా ఉద్యానవనాలు

**తిరుమల, సెప్టెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:**



ఆధ్యాత్మిక ఆహ్లాదకర వాతావరణం ఉట్టిపడేలా తిరుమలకొండపై ఉద్యావనాలు తీర్చిదిద్దినట్లు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఇఓ ఏవి ధర్మారెడ్డి తెలిపారు. జిఎన్‌సి టోల్‌గేట్ వద్ద, లేపాక్షి సమీపంలోని ఫిల్టర్ హౌస్‌వద్ద దాతల సహకారంతో అభివృద్ధిచేసిన రెండు ఉద్యానవనాలను శుక్రవారం రాత్రి ప్రారంభించారు.

## బిసీల అభివృద్ధికి కట్టుబడి ముందడుగు

**– అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**

**చిత్తూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:**
రాష్ట్రంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ముందుడుగు వేస్తోందని రాష్ట్ర భూగర్భ గనులు, విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు.



పివికెఎన్ డిగ్రీ కళాశాల ఆవరణలో 4.43 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించిన జ్యోతిరావ్ పూలే భవనంను డిప్యుటీ సిఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు, ఎంపీ రెడ్డప్ప, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ సగిలి షన్మోహన్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, డిఆర్ఓ రాజశేఖర్, రాష్ట్ర ఎపిఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ బుల్లెట్ సురేష్, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ ఛైర్మన్ శాంతి, డిసిసిబి ఛైర్‌పర్సన్ రెడ్డమ్మ, చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, స్త్రీ శిశు సంక్షేమశాఖ జోనల్ ఛైర్‌పర్సన్ శైలజారెడ్డి, డిప్యుటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, బిసీ సంక్షేమ అధికారి రబ్బానీభాషా, సాంఘీక సంక్షేమశాఖ జెడి డాక్టర్ రాజ్యలక్ష్మీ, ఆర్డీఓ డాక్టర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం పూర్తికావస్తున్న బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

**కాణిపాకం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో ఈనెల 18 నుండి జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల గడువు దగ్గర పడుతుండడంతో ఏర్పాట్లు శరవేగంగా సాగుతూ తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. దేవస్థానంలో ఈనెల 18 నుండి స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతిఏటా 21 రోజులు పాటు జరిగే ఈఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈమేరకు బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి దేవస్థానం నెల రోజుల క్రితం నుండే ఏర్పాట్లు చేపట్టింది. బ్రహ్మోత్సవాల ప్రారంభానికి కేవలం రెండు రోజుల వ్యవధి మాత్రమే వుండడంతో ఈఏర్పాట్లును శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రధాన ఆలయ కుంభాభిషేకం సందర్బంగా ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయాలకు రంగులు వేయడం, ప్రధాన ఆలయంలో రంగవల్లులు తీర్చిదిద్దడం, విద్యుత్ దీపాలంకరణ వంటి పనులు పూర్తి చేయడంతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు దాదాపు పూర్తయింది. మిగిలిన చిన్న చిన్న ఏర్పాట్లును శనివారం లోగా పూర్తి చేయడానికి ఆలయ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. అలాగే ఆలయ పరిసరాలు, ఇతర ప్రాంతాల్లో విద్యుద్దీపాల కటౌట్‌లు, ఆర్చిల ఏర్పాటుకు రాత్రంబవళ్ళు కార్మికులు శ్రమిస్తున్నారు.అలాగే ఇప్పటికే పూర్తయిన ఏర్పాట్లుకు తుదిమెరుగులు దిద్దుతున్నారు.

## అటు దీక్షలు.. ఇటు హోమాలు

**– సూళ్లూరుపేటలో టిడిపి నిరసనలు**



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్షలో భాగంగా శుక్రవారం ఒక వైపు పార్టీ కార్యాలయం వద్ద దీక్షలు చేస్తుండగా, మరోవైపు శ్రీసుదర్శన మహా హోమాన్ని నిర్వహించారు. చంద్రబాబు అక్రమ కేసుల నుంచి త్వరగా బయటపడాలని ఆకాంక్షిస్తూ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా సుదర్శన మహాయాగాన్ని నిర్వహించారు. అలాగే దీక్షలు కొనసాగింపులో భాగంగా సూళ్లూరుపేట మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలలో మాజీమంత్రి పరసా రత్నం పాల్గొని ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని, చంద్రబాబును విడుదల చేసే వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. తిరుపతి పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ దీక్షలతో పాటు దైవబలం కూడా మెండుగా ఉండాలన్న ఉద్దేశంతో పార్టీ కార్యకర్తలు, నేతల అభిమతం మేరకు సుదర్శన మహాహోమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, మెస్ రమణయ్య, చిట్టేటి పెరుమాళ్లు, నూలేటి విజయలక్ష్మి, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, దువ్వూరు మురళీరెడ్డి, పూడి సెల్వం, గండవరం రమేష్‌రెడ్డి, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే సీఎం జగన్మోహన్‌రెడ్డి లక్ష్యం : ఎంపీ

**బాలాయపల్లి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:**
పేదల సంక్షేమమే సీఎం జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీ గురుమూర్తి తెలిపారు. మండలంలోని మన్నూరు ఎస్సీ కాలనీ, మిట్ట కాలనీ తదితర ప్రాంతాల్లో వైసీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుం దన్నారు.



ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ సీఎం జగన్మోహన్‌రెడ్డి నెరవేర్చినట్లు తెలిపారు. 2024లో జరగబోయే ఎన్నికల్లో వైసీపీ అఖండ మెజారిటీతో గెలుస్తుందని, మరలా సీఎం జగన్మోహన్‌రెడ్డి సీఎం అవుతారని నేదురుమల్లి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. పేదల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. కాగా మన్నూరు గ్రామం వద్ద కలుజువాకపై వంతెన నిర్మిస్తే 10 గ్రామాలకు రాకపోకలు జరుగుతాయని ఎంపీ, రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి గ్రామస్థులు తీసుకొనివెళ్లారు. వంతెన నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని అధికారులకు ఆదేశించారు. గ్రామస్థులు చెప్పిన పలు సమస్యలను పరిష్కరించమని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు, సొసైటీ అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, కాసారం రంగనాథం, గోపికృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, తహసీల్దారు శ్రీనివాసులు, ఏవో శిరీష తదితరులు పాల్గొన్నారు.